


# ప్రజాప్రశ్న
తెలుగు దినపత్రిక




సంపుటి: 5 సంచిక: 15, పేజీలు - 08

గురువారం, జూన్ 19, 2025 వెల: 5 రూ/.

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

## ఫాస్టాగ్ వార్షిక పాస్.. ఇదో గేమ్ ఛేంజర్

**- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి పవన్ కృతజ్ఞతలు**



**అమరావతి (ప్రశ్న న్యూస్)** జాతీయ రహదారులపై ప్రయాణించే వారికి ఊరటనిస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఫాస్టాగ్ ఆధారిత వార్షిక పాస్‌ల వ్యవస్థపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తీసుకున్న ఈ నిర్ణయం, భారత రహదారి మౌలిక సదుపాయాల ప్రస్థానంలో

2లో..

## నేనేం చేస్తానో ఎవరికీ తెలియదు

**- ఇరాన్‌పై ట్రంప్ సంచలన వ్యాఖ్యలు**



న్యూయార్క్ (ప్రశ్న న్యూస్) ఇరాన్ వ్యవహారంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ ఇప్పటికే హద్దులు మీరి ప్రవర్తించిందని, దానిపై స్పందించడంలో చాలా జాప్యం జరిగిందని ఆయన అన్నారు. ఇజ్రాయెల్‌తో ఇరాన్‌కు కొనసాగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో, ఈ వివాదంలో అమెరికా జోక్యం చేసుకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని

2లో..

## దేశంలో మళ్లీ కరోనా అలజడి

**- నాలుగు కొత్త ఒమిక్రాన్ సబ్ వేరియంట్లు గుర్తింపు**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) దేశవ్యాప్తంగా ఇటీవల కరోనా వైరస్ కేసులు మళ్లీ పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఈ తాజా కేసుల పెరుగుదలకు ఒమిక్రాన్‌కు చెందిన నాలుగు కొత్త ఉపరకాలే (సబ్ వేరియంట్లు) కారణమని పుణెలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ (ఎన్ఐవీ) నిర్ధారించింది.

2లో..

# గూగుల్ ఒక వినూత్న సంస్థ

**- గూగుల్ సేఫ్టీ సెంటర్‌ను ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి**

- డిజిటల్ భద్రతే ఈ కేంద్రం ప్రధాన ఉద్దేశమని వెల్లడి
- నైపుణ్యాభివృద్ధికి రాష్ట్రంలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామన్న సీఎం
- 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యమని వెల్లడి



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్‌లో గూగుల్ సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్ ప్రారంభించారు. ఇది భారతదేశంలో మొదటి సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్. ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో టోక్యో తర్వాత రెండవ సెంటర్ కావడం విశేషం. ఈ సేఫ్టీ సెంటర్ సైబర్ సెక్యూరిటీ, ఆన్‌లైన్ భద్రత, ఏఐ-ఆధారిత భద్రతా పరిష్కారాలపై పరిశోధన చేస్తుంది. ఇది తెలంగాణ, భారతదేశ డిజిటల్ భద్రతను పెంపొందించడంతోపాటు, వేలాది యువతకు ఉద్యోగ అవకాశాలు రానున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గూగుల్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించి ఈ ప్రాజెక్ట్‌ను



హైదరాబాద్‌కు తేవడంలో కీలక పాత్ర పోషించారు. ఈ కేంద్రం భారతదేశానికి సంబంధించిన సైబర్ సెక్యూరిటీ సవాళ్లకు పరిష్కారాలను అందిస్తుంది. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి భద్రతా హబ్‌గా తీర్చిదిద్దుతుందని తెలంగాణ ప్రభుత్వం ఆశిస్తోంది. రేవంత్ రెడ్డి గూగుల్‌తో ఈ భాగస్వామ్యం తెలంగాణ యువతకు, ఇంజనీర్‌లకు, భద్రతా నిపుణులకు విశేష అవకాశాలను కల్పిస్తుందని చెప్పారు.

**- సైబర్ భద్రత, ఆన్‌లైన్ సెక్యూరిటీ**

ఈ కేంద్రం సైబర్ సెక్యూరిటీ,

2లో..

## డబుల్ గేమ్ వద్దు..
## ఉగ్రవాదానికి మద్దతిస్తే మూల్యం తప్పదు

**- ఆ దేశాలకు మోదీ వార్నింగ్**



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** ప్రపంచ ఆర్థిక శక్తివంతమైన దేశాల కూటమి జీ-7 సదస్సులో భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కీలక ప్రసంగం చేశారు. ఉగ్రవాదంపై ప్రపంచ దేశాలన్నీ ఏకమై పోరాడాలని ఈ విషయంలో అనుసరిస్తున్న ద్వంద్వ వైఖరిని తక్షణమే విడనాడాలని ఆయన పిలుపునిచ్చారు. ఉగ్రవాదానికి మద్దతు ఇచ్చే దేశాలను జవాబుదారీగా చేయాలని ప్రధాని మోదీ జీ-7 ఔట్‌రీచ్ సెషన్‌లో స్పష్టం చేశారు. ఉగ్రవాదం ప్రపంచ శాంతికి, స్థిరత్వానికి అతి పెద్ద ముప్పుగా పరిణమించిందని మోదీ తన ప్రసంగంలో నొక్కి చెప్పారు. కొన్ని దేశాలు ఉగ్రవాదాన్ని రాజకీయ సాధనంగా ఉపయోగిస్తున్నాయని, ఇది ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదని అన్నారు. "ఉగ్రవాదానికి మద్దతు ఇచ్చే దేశాలను కొన్నిసార్లు బహుమతులతో సత్కరిస్తున్న

2లో..

# రైతులకు అండగా నిలవాలి

**- మామిడి, పొగాకు, కోకోపై సీఎం చంద్రబాబు సమీక్ష**



**అమరావతి (ప్రశ్న న్యూస్)** పొగాకు, మామిడి తదితర పంట ఉత్పత్తులకు సంబంధించి నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా రైతులకు అండగా నిలవాల్సిన అవసరం ఉందని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. పంట ఉత్పత్తులను వాణిజ్య కోణంలోనే చూడాలని, వీలైనంత మెరుగైన ధర వచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. హెచ్డీ బర్లీ పొగాకు కొనుగోళ్లల్లో వేగం పెంచాలని సీఎ ఆదేశించారు. సచివాలయంలో మామిడి, పొగాకు, కోకో పంటల మద్ధతు ధరతో పాటు వివిధ అంశాలపై సీఎం చంద్రబాబు అధికారులతో సమీక్ష నిర్వహించారు.

**- కేంద్రాలు ద్వారా పొగాకు కొనుగోలు**

మిగిలిన 53 మిలియన్ కేజీల హెచ్డీ బర్లీ పొగాకును త్వరగా కొనుగోలు చేయాలని సీఎం ఆదేశించారు. ఇందులో 33 మిలియన్ కేజీల పొగాకును 24 కంపెనీల ద్వారా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకున్నట్టు అధికారులు వివరించారు. మరో 20 మిలియన్ కేజీల మేర పొగాకును ఏపీ మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలుకు ఏర్పాట్లు చేసినట్టు సీఎంకు అధికారులు తెలిపారు. బాపట్ల, గుంటూరు, పల్నాడు, ప్రకాశం జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ద్వారా పొగాకు కొనుగోలు ప్రారంభించామని వీటి ద్వారా రేపటి నుంచే కొనుగోళ్లు ముమ్మరం చేస్తామని అధికారులు సీఎం దృష్టికి తెచ్చారు. కొనుగోళ్ల కేంద్రాల వివరాలను, సంబంధిత సమాచారాన్ని ప్రతీ పొగాకు రైతుకు అందివ్వాలని సీఎం ఆదేశించారు.

**- రైతులకు ఎప్పటికప్పుడు అవగాహన**

ఆయిల్పై సుంకం తగ్గింపు, మ్యాంగో పల్ప్పై జీఎస్టీని 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గించే అంశంపై ఇప్పటికే కేంద్రంతో మాట్లాడానని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. దీనిపై అధికారులు సంబంధిత కేంద్ర ప్రభుత్వ శాఖలతో

2లో..

## ఏసీబీ నోటీసుపై స్పందించిన కేటీఆర్

- సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్ స్వాధీనంపై తీవ్ర అభ్యంతరం
- ప్రాథమిక హక్కులు, గోప్యతకు భంగమంటూ లేఖ
- సుప్రీంకోర్టు తీర్పును ప్రస్తావించిన మాజీ మంత్రి



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఫార్ములా-ఈ కార్ రేసు వ్యవహారానికి సంబంధించి తన సెల్‌ఫోన్‌ను అప్పగించాలంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) జారీ చేసిన నోటీసుపై

2లో..

## కూటమి గెలిచాక వారిని
## ఊరు విడిచి వెళ్లిపోమన్నారు

**- పల్నాడు జిల్లాలో జగన్ తీవ్ర ఆరోపణలు**

- పల్నాడు జిల్లా రెంటపాళ్లలో మాజీ సీఎం జగన్ పర్యటన
- ఆత్మహత్య చేసుకున్న ఉపసర్పంచ్ నాగమల్లేశ్వరరావు కుటుంబానికి పరామర్శ
- ఏపీలో అభివృద్ధి, సంక్షేమం లేవని, 'రెడ్ బుక్ రాజ్యాంగం' నడుస్తోందని విమర్శ
- నాగమల్లేశ్వరరావును బెదిరించిన సీఐపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

**పల్నాడు (ప్రశ్న న్యూస్)** రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు దారుణంగా ఉన్నాయని, పల్నాడు జిల్లా, సత్తెనపల్లి మండలం, రెంటపాళ్ల గ్రామానికి చెందిన కోర్లకుంట వెంకటేశ్వరరావు కుటుంబానికి జరిగిన అన్యాయమే దీనికి నిదర్శనమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆయన రెంటపాళ్లలో పర్యటించి, ఆత్మహత్యకు పాల్పడిన నాగమల్లేశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంతకుముందు నాగమల్లేశ్వరరావు విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం జగన్ మీడియాతో మాట్లాడారు.

**- పోలీసు వేధింపులతోనే ఆత్మహత్య**

గత ఏడాది అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ రోజున రెంటపాళ్ల ఉపసర్పంచ్‌గా ఉన్న నాగమల్లేశ్వరరావుపై



తెలుగుదేశం, జనసేన నాయకులు తప్పుడు ఆరోపణలు చేశారని జగన్ ఆరోపించారు. ఆ ఆరోపణలతో పోలీసులు ఆయనను పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి తీవ్రంగా అవమానించారని అన్నారు.

2లో..

## హైదరాబాద్ లో ఇల్లు, ఫ్లాట్ కొనే వారికి హైడ్రా హెచ్చరిక

**- వివరాలన్నీ చెక్ చేసి కొనుక్కోవాలని సూచన**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్.. దేశంలోని మెట్రోపాలిటన్ నగరాల్లో ఒకటి. ప్రపంచంలోని మహా నగరాల్లో 41వ స్థానంలో ఉంది. రోజురోజుకీ హైదరాబాద్ నగరం విస్తరిస్తూ ఉంది. అటు ఐటీ, ఫార్మా, టెక్ రంగాల్లో రాష్ట్ర రాజధాని దూసుకెళ్తోంది. ఈ క్రమంలో హైదరాబాద్ లో ఇళ్లు, ప్లాట్లు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. మరోవైపు రియల్ ఎస్టేట్ రంగం కూడా క్రమంగా పుంజుకుంటున్న నేపథ్యంలో హైదరాబాద్ లో భారీగా ఇళ్లు, ప్లాట్లు కొనుగోలు జరుగుతోంది. ఈ క్రమంలో హైడ్రా కీలక సూచనలు చేసింది. దేశంలోని మెట్రోపాలిటన్ నగరాల్లో ఒకటైన

2లో..

# టోల్ జంఝాటం నుంచి విముక్తి

**- ఏడాది పాస్- ధర ఇదే**

**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** ఫాస్టాగ్ ల విషయంలో కేంద్ర ప్రభుత్వం సంచలన నిర్ణయాన్ని తీసుకుంది. జాతీయ రహదారులపై నిర్మించిన టోల్ ప్లాజాల వద్ద వాహనాల రాకపోకలు మరింత సజావుగా సాగడానికి సరికొత్త వ్యవస్థకు శ్రీకారం చుట్టింది. వాహనాల రాకపోకలకు ఎలాంటి అడ్డంకులు లేకుండా చేయడంలో భాగంగా అత్యాధునిక పద్ధతుల్లో టోల్ ఫీజులను వసూలు చేయబోతోంది. ప్రస్తుతం జాతీయ రహదారులపై నెలకొల్పిన ప్లాజాల వాహనాల నుంచి టోల్ మొత్తాన్ని వసూలు చేస్తోంది కేంద్ర ప్రభుత్వం. దీని కోసం ఫాస్టాగ్ విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఫాస్టాగ్ విధానం అందుబాటులో ఉన్నప్పటికీ టోల్ ప్లాజాల వద్ద తప్పనిసరిగా కొంతసేపయినా




వాహనాలను నిలిపివేయాల్సి వస్తోంది.

2లో..

## ఇజ్రాయెల్ ఆర్థిక వ్యవస్థపై ఇరాన్ దాడుల దెబ్బ

**- ఒక్క రాత్రి ఖర్చు రూ.2400 కోట్లు**

**ఇజ్రాయెల్ (ప్రశ్న న్యూస్)** ఇరాన్‌తో పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఇజ్రాయెల్ ఆర్థికంగా తీవ్ర భారం మోయాల్సి వస్తోంది. ఇరాన్ ప్రయోగిస్తున్న క్షిపణుల నుంచి తమ భూభాగాన్ని కాపాడుకునేందుకు ఇజ్రాయెల్ రాత్రికి రాత్రే భారీగా నిధులు వెచ్చిస్తోంది. ఈ గగనతల రక్షణ వ్యవస్థ నిర్వహణకే ప్రతి రాత్రి సుమారు 285 మిలియన్ డాలర్లు, అంటే భారత కరెన్సీలో దాదాపు రూ. 2,400 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి.



2లో..

## బీసీ రిజర్వేషన్లకు అనుమతి తీసుకువస్తేనే
## నామినేషన్లు వేయనిస్తాం

**- లేనిపక్షంలో ఎన్నికలను అడ్డుకుంటామని స్పష్టం**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కాంగ్రెస్ ప్రభుత్వంపై మరోసారి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. బీసీ రిజర్వేషన్ల అంశం కొలిక్కి రాకుండానే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని చూస్తే చూస్తూ ఊరుకోబోమని ఆమె హెచ్చరించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే పంచాయతీ ఎన్నికలకు వెళ్లాలని, లేనిపక్షంలో ఎన్నికలను అడ్డుకుంటామని స్పష్టం చేశారు. ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల విషయంలో స్పష్టమైన హామీ ఇవ్వాలని కవిత డిమాండ్ చేశారు. "ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీ రిజర్వేషన్లకు అనుమతి తీసుకువస్తేనే నామినేషన్లు వేయనిస్తాం. లేదంటే ప్రతి వార్డులో వందల సంఖ్యలో నామినేషన్లు వేసి ఎన్నికల ప్రక్రియను నిలుపుదల చేస్తాం" అని కవిత అన్నారు. బీసీ రిజర్వేషన్ బిల్లును అసెంబ్లీ, మండలిలో ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి పంపామని, పార్లమెంటులో ఈ బిల్లును కేంద్రం ఆమోదించకపోతే దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని ఆమె తెలిపారు. "జులై రెండో వారం వరకు కేంద్రానికి గడువు ఇస్తున్నాం. ఆలోపు అనుమతి రాకపోతే జులై 17 నుంచి రైలు రోకోలు నిర్వహిస్తాం" అని కవిత హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన గోదావరి-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు, బొల్లాపల్లి రిజర్వాయర్ ప్రాజెక్టులను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే అడ్డుకోవాలని

2లో..

## ఫాస్టాగ్ వార్షిక పాస్..

# ఇదో గేమ్ ఛేంజర్

ఒక గేమ్ ఛేంజర్‌గా నిలుస్తుందని ఆయన అభివర్ణించారు. ఈ మేరకు పవన్ కల్యాణ్ 'ఎక్స్ (ట్విట్టర్)' వేదికగా తన అభిప్రాయాలను పంచుకున్నారు. ఫాస్టాగ్ వార్షిక పాస్‌లను ప్రవేశపెట్టాలన్న ప్రయాణికుల చిరకాల డిమాండ్‌కు ఈ నిర్ణయంతో సరైన పరిష్కారం లభించిందని పవన్ పేర్కొన్నారు. టోల్ చెల్లింపుల ప్రక్రియను సులభతరం చేయడంతో పాటు ప్రయాణ ఖర్చులను గణనీయంగా తగ్గించడం ద్వారా ప్రైవేటు వాహన యజమానులకు ఈ కొత్త విధానం ఎంతో మేలు చేస్తుందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు."రూ.3000 వార్షిక పాస్‌తో వాహనదారులకు ఆర్థికంగా ఉపశమనం కలగడమే కాకుండా, దేశవ్యాప్తంగా సున్నితమైన, వేగవంతమైన, ఎలాంటి వివాదాలకు తావులేని విధంగా హైవే ప్రయాణం సాధ్యమవుతుంది" అని జనసేనాని పేర్కొన్నారు. ముఖ్యంగా టోల్ ప్లాజాల సమీపంలో నివసిస్తూ, తరచూ ప్రయాణించే వారికి ఈ విధానం వల్ల సమయంతో పాటు ఆర్థిక భారం కూడా తగ్గుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని ప్రభుత్వానికి ప్రజాపాలన పట్ల ఉన్న నిబద్ధతకు నితిన్ గడ్కరీ తీసుకున్న ఈ నిర్ణయం ఒక నిదర్శనమని పవన్ కొనియాడారు.కాగా, ఫాస్టాగ్ ఆధారిత వార్షిక పాస్‌లను ఆగస్టు 15 నుంచి అందుబాటులోకి తీసుకురానున్నట్లు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తాజాగా ప్రకటించిన సంగతి తెలిసిందే. రూ.3000 చెల్లించి ఈ పాస్‌ను పొందవచ్చని ఆయన 'ఎక్స్ (ట్విట్టర్)' లో వెల్లడించారు. గడ్కరీ చేసిన ఈ పోస్టును రీట్వీట్ చేస్తూ పవన్ కల్యాణ్ పైవిధంగా స్పందించారు. అయితే, ప్రస్తుతం కార్లు, జీపులు, వ్యాన్‌ల వంటి వాణిజ్యేతర వాహనాలకు వర్తించేలా కేంద్రం ప్రకటించిన ఈ పాస్‌కు సంబంధించిన పూర్తిస్థాయి మార్గదర్శకాలు, వర్తించే నిబంధనలు ఇంకా వెలువడాల్సి ఉంది.

# నేనేం చేస్తానో ఎవరికీ తెలియదు

ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ, ఇరాన్‌పై లేదా ఆ దేశ అణు కేంద్రాలపై దాడులు చేసే ఆలోచన అమెరికాకు ఉందా అనే విషయాన్ని స్పష్టం చేయడానికి ట్రంప్ నిరాకరించారు. అయితే, టెహ్రాన్ తన పరిమితులను అతిక్రమించిందని, దీనిపై చర్యలు తీసుకోవడం ఇప్పటికే ఆలస్యమైందని ఆయన అభిప్రాయపడ్డారు. వచ్చే వారంలో లేదా అంతకంటే ముందుగానే చాలా కీలకమైన పరిణామాలు చోటుచేసుకోవచ్చని ఆయన సూచనప్రాయంగా తెలిపారు."వారం క్రితం ఉన్న పరిస్థితులతో పోలిస్తే ఇప్పుడు చాలా మార్పు వచ్చింది. ఇరాన్‌పై ఇజ్రాయెల్ చేస్తున్న దాడుల్లో నేను జోక్యం చేసుకుంటానో లేదో చెప్పలేను. నేను ఏం చేయబోతున్నానో ఎవరికీ తెలియదు" అని డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. వైట్‌హౌస్‌లో చర్చలు జరిపేందుకు ఇరాన్ ప్రతిపాదన చేసిందని చెబుతూనే, ఆ చర్చలు ఎప్పుడు, ఏ విధంగా జరుగుతాయనే వివరాలను వెల్లడించలేదు. ప్రస్తుతం టెహ్రాన్ తనను తాను రక్షించుకోలేని స్థితిలో ఉందని, ఆ దేశం వద్ద సరైన గగనతల రక్షణ వ్యవస్థలు కూడా లేవని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇరాన్ అగ్రనాయకత్వం గురించి అడిగిన ప్రశ్నకు, 'గుడ్‌లక్' అంటూ ట్రంప్ బదులిచ్చారు. టెహ్రాన్ విషయంలో తన యంత్రాంగానికి ఓపిక నశించిందని ఆయన స్పష్టం చేశారు. ఈ యుద్ధంలో అమెరికా జోక్యం చేసుకోవడంపై స్థానికంగా వ్యక్తమవుతున్న ఆందోళనల గురించి మాట్లాడుతూ, సుదీర్ఘకాలం యుద్ధం చేయాలనే కోరిక తమకు లేదని అన్నారు. ఇరాన్ వద్ద అణ్వాయుధాలు ఉండకూడదన్నదే తన ప్రధాన ఉద్దేశమని ఆయన పునరుద్ఘాటించారు.మరోవైపు, ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీని ఉద్దేశించి అధ్యక్షుడు ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఖమేనీ ఎక్కడ దాక్కున్నారో తమకు తెలుసని, ఆయన సురక్షితంగానే ఉన్నారని ట్రంప్ అన్నారు. అయితే, ప్రస్తుతానికి ఆయన్ను అంతమొందించాలనే ఆలోచన లేదని, ఇరాన్ బేషరతుగా లొంగిపోవాలని, లేకపోతే పరిస్థితులు మరింత తీవ్రంగా మారతాయని హెచ్చరించారు. ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలపై సుప్రీం లీడర్ ఖమేనీ తీవ్రంగా ప్రతిస్పందించారు. లొంగిపోయే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. ఒకవేళ అమెరికా సైన్యం ఈ విషయంలో జోక్యం చేసుకుంటే, దాని పర్యవసానాలు చాలా తీవ్రంగా ఉంటాయని ఆయన హెచ్చరించారు.

# దేశంలో మళ్లీ కరోనా అలజడి

జీనోమ్ సీక్వెన్సింగ్ ద్వారా ఈ కొత్త ఉపరకాలను గుర్తించినట్లు శాస్త్రవేత్తలు వెల్లడించారు. ఈ పరిశోధన ఫలితాలు వ్యాక్సిన్‌ల సామర్థ్యాన్ని అంచనా వేయడంలో ఉపయోగపడతాయని వారు తెలిపారు. దేశవ్యాప్తంగా నమోదవుతున్న కరోనా కేసుల నమూనాలను విశ్లేషించినప్పుడు ఒమిక్రాన్‌కు చెందిన నాలుగు ఉపరకాలు వెలుగులోకి వచ్చినట్లు ఎన్ఐవీ-పుణె డైరెక్టర్ డాక్టర్ నవీన్ కుమార్ వివరించారు. "మేము వీటిని ఎల్ఎఫ్.7, ఎక్స్ఎఫ్‌జీ, జేఎన్.1.16, ఎన్‌బీ.1.8.1 వేరియంట్లుగా గుర్తించాం. మొదట్లో జేఎన్.1.16 వేరియంట్ వల్ల కేసులు పెరిగినా, ఈ ఏడాది మే నెల నుంచి ఎక్స్ఎఫ్‌జీ వేరియంట్ ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. ఎల్ఎఫ్.7, ఎల్‌పీ.81.2 అనే రెండు వేరియంట్లు కలిసి ఎక్స్ఎఫ్‌జీగా రూపాంతరం చెందాయి" అని డాక్టర్ నవీన్ కుమార్ తెలిపారు. కొత్త వేరియంట్లను ఎప్పటికప్పుడు గుర్తించి, వాటి జన్యుక్రమాన్ని విశ్లేషించే ప్రక్రియ నిరంతరం కొనసాగుతోందని ఆయన చెప్పారు.ఈ ఏడాది ఏప్రిల్ రెండో వారం నుంచి దేశంలో కరోనా కేసుల సంఖ్య క్రమంగా పెరుగుతూ వస్తోంది. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం, ప్రస్తుతం దేశవ్యాప్తంగా 6,483 కొవిడ్-19 యాక్టివ్ కేసులు ఉన్నాయి. ఈ ఏడాది జనవరి 1 నుంచి ఇప్పటివరకు కరోనా కారణంగా 113 మంది మరణించినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ముఖ్యంగా కేరళలో కొవిడ్ ప్రభావం ఎక్కువగా ఉండగా, గుజరాత్, కర్ణాటక, ఢిల్లీ రాష్ట్రాల్లో కూడా వైరస్ వ్యాప్తి అధికంగానే ఉంది. అయితే, ప్రస్తుతానికి ఇన్ఫెక్షన్ తీవ్రత తక్కువగానే ఉందని, బాధితులు ఎక్కువగా ఇళ్లలోనే ఉంటూ అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటున్నారని అధికార వర్గాలు పేర్కొన్నాయి. వ్యాధి లక్షణాలు స్వల్పంగా ఉండటంతో ఆసుపత్రులలో చేరేవారి సంఖ్య తక్కువగానే ఉందని తెలుస్తోంది. అయినప్పటికీ, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కొవిడ్ నిబంధనలు పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు.

# రైతులకు అండగా నిలవాలి

సమన్వయం చేసుకోవాలని సూచించారు. మామిడి పంటకు సంబంధించి పంట ప్రణాళికపై రైతులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలన్నారు. పండించిన పంటకు సరైన ధర దక్కాలంటే ఆ పంటకు మార్కెట్లో ఎలాంటి డిమాండ్ ఉందనే సమాచారం రైతులకు ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం మామిడికి ఒక్కో కిలోకు 4 రూపాయల చొప్పున అదనంగా మద్ధతు ధర ఇస్తున్నామని ప్రాసెసింగ్ యూనిట్లు 8 రూపాయలకి తగ్గకుండా కొనుగోలు చేసేలా చూడాలని అధికారులకు సూచించారు.

**- గ్రేడింగ్ విధానాలను అమలు**

ఈ ఏడాదిలో కోకో 12000 మెట్రిక్ టన్నుల మేర ఉత్పత్తి వచ్చిందని అధికారులు సీఎంకు వివరించారు. ఇప్పటికే 10000 మెట్రిక్ టన్నుల విక్రయం కూడా జరిగినట్టు తెలిపారు. ప్రతీ రోజూ 80 నుంచి 100 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేస్తున్నట్టు తెలిపారు. జూలై మొదటి వారానికి మిగిలిన ఉత్పత్తిని కూడా కొనుగోలు చేయాలని సీఎం ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా పండ్లకు సంబంధించిన ప్రాసెసింగ్ యూనిట్లను మరిన్ని ఏర్పాటు చేసేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలన్నారు. అంతర్జాతీయ మార్కెట్కు అవసరమైనట్టుగా ఎగుమతులు పెంచేందుకు అత్యుత్తమ గ్రేడింగ్ విధానాలను అమలు చేయాల్సిందిగా సీఎం సూచించారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, వ్యవసాయ, ఉద్యాన శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఏసీబీ నోటీసుపై స్పందించిన కేటీఆర్

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. ఈ మేరకు ఆయన ఏసీబీ అధికారులకు ఒక లేఖ రాశారు. ఫార్ములా-ఈ కార్ రేసు నిర్వహణలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై ఏసీబీ విచారణ జరుపుతున్న విషయం విదితమే. ఈ క్రమంలోనే కేటీఆర్‌ను కూడా అధికారులు విచారిస్తున్నారు. విచారణలో భాగంగా కేటీఆర్ వాడుతున్న సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్‌ను తమకు అందజేయాలని ఏసీబీ అధికారులు కోరారు. అయితే, తన సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకోవాలని కోరడం ప్రాథమిక హక్కులకు, వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించడమేనని కేటీఆర్ తన లేఖలో స్పష్టం చేశారు. ఇదే విషయాన్ని సుప్రీంకోర్టు కూడా పలు సందర్భాల్లో నొక్కి చెప్పిందని ఆయన గుర్తు చేశారు. ఏసీబీ అధికారుల ఆదేశాలపై కేటీఆర్ తన న్యాయవాదులతో సుదీర్ఘంగా చర్చించారు. ప్రస్తుత పరిస్థితుల్లో మొబైల్ ఫోన్‌ను గానీ, ల్యాప్‌టాప్‌ను గానీ ఏసీబీకి అప్పగించాల్సిన అవసరం లేదని న్యాయనిపుణులు కేటీఆర్‌కు సలహా ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ న్యాయ సలహా మేరకే కేటీఆర్ ఏసీబీకి లేఖ ద్వారా తన నిర్ణయాన్ని తెలియజేశారు.

# గూగుల్ ఒక వినూత్న సంస్థ

ఆన్‌లైన్ భద్రత, %ూ×%-ఆధారిత భద్రతా పరిష్కారాలపై పరిశోధన చేస్తుంది. ఇది భారతదేశం, తెలంగాణకు అవసరమైన సైబర్ భద్రతా సవాళ్లకు పరిష్కారాలను అందిస్తుంది. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి భద్రతా హబ్‌గా మార్చడంలో గూగుల్ సేఫ్టీ ఇంజినీరింగ్ సెంటర్ కీలక పాత్ర పోషిస్తుంది.

**- ఉద్యోగ అవకాశాలు**

ఈ కేంద్రం వల్ల యువతకు, ఇంజనీర్‌లకు, భద్రతా నిపుణులకు వేలాది ఉద్యోగ అవకాశాలు ఏర్పడతాయి. తెలంగాణ రాష్ట్రంలో డిజిటల్ భద్రత, సాంకేతిక వికాసం, ఇన్నోవేషన్‌లను పెంపొందిస్తుంది. గూగుల్‌తో భాగస్వామ్యం వల్ల తెలంగాణకు ప్రపంచ స్థాయి సాంకేతిక పరిజ్ఞానం మరియు మార్కెట్ ఎక్స్పోజర్ లభిస్తుంది. గూగుల్ ప్రారంభించినప్పటి నుంచి ప్రపంచం మారిపోయింది. నేడు, మన జీవితాలు పూర్తిగా డిజిటల్ మారాయి. మనం గోప్యత, భద్రత గురించి నేడు ఆందోళన చెందుతున్నాం. మన ఆర్థిక వ్యవస్థ, మన ప్రభుత్వం, మన జీవితాలు డిజిటల్ గా మారాయి. డిజిటల్ సురక్షితంగా ఉంటే, మనం మరింత అభివృద్ధి చెందుతాం. అధునాతన సైబర్ సెక్యూరిటీ , భద్రతా పరిష్కారాల కోసం గూగుల్ ఈ సైబర్-సెక్యూరిటీ హబ్‌ను ఉపయోగిస్తున్నందుకు గర్వంగా ఉంది. ఇది నైపుణ్య అభివృద్ధి పై దృష్టి పెడుతుంది. ఉపాధిని సృష్టించడం తో పాటు దేశం సైబర్ భద్రతా సామర్థ్యాన్ని పెంచుతుంది. చెడు చేయవద్దన్నది గూగుల్ సంస్థ సిద్ధాంతం ఈ విధానాన్ని నేను ఇష్టపడుతున్నాను.

**- ఇదే తెలంగాణ రైజింగ్**

గూగుల్ లాగా, నా ప్రభుత్వం కూడా మంచిని మాత్రమే చేస్తుందని నమ్ముతున్నాను. ఈ విధానం వల్ల ప్రయోజనాలు కొంత నెమ్మదిగా కనిపిస్తాయి, అయితే మనం దీర్ఘకాలికంగా దృష్టి పెట్టి పని చేయాలి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సంస్థలు ఉత్తమ పెట్టుబడి అనుకూల రాష్ట్రం కోసం శోధిస్తే దానికి సమాధానం తెలంగాణ అని వస్తుంది. మీకు సెర్చ్ లో మొదటి లింక్ హైదరాబాద్ వస్తుంది. దీనిని మేము తెలంగాణ రైజింగ్ అని పిలుస్తాము.

**- 1 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థ వైపు అడుగులు**

2035 నాటికి తెలంగాణను 1 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేయాలనుకుంటున్నాం. మేము 1 కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనుకుంటున్నాం. గూగుల్ ఆఫీస్ పక్క ని రెండున్నర ఎకరాల్లో స్వయం సహాయక సంఘాల మహిళ ల కోసం స్టాల్స్ ఏర్పాటు చేశా మేము మా రైతులను సంపన్నులుగా తయారు చేయడంతో పాటు సంతోషంగా ఉంచాలనుకుంటున్నాం. మా యువతలో నైపుణ్యాలు పెంచడంతో పాటు వారికి ఉపాధి కల్పించాలనుకుంటున్నాం. వీటన్నిటికీ, నాకు మీ మద్దతు అవసరం. తెలంగాణ రైజింగ్‌కు బ్రాండ్ అంబాసిడర్లుగా కావాలని కోరుకుంటున్న.గూగుల్ , హైదరాబాద్ పాత స్నేహితులు. 2007లో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో గూగుల్ తన మొదటి కార్యాలయాన్ని ఇక్కడ ఏర్పాటు చేసింది. దాదాపు 7,000 మంది గూగుల్ ఉద్యోగులు నేడు హైదరాబాద్‌ను తమ ఇల్లుగా భావిస్తున్నారు. విద్య, భద్రత, మ్యాప్‌లు, ట్రాఫిక్, స్టార్టప్‌లు, ఆరోగ్యం ఇలా అనేక రంగాలలో గూగుల్ తో కలిసి మేం పనిచేస్తున్నాం. గూగుల్ ఒక వినూత్న సంస్థ, మాది ఒక వినూత్న ప్రభుత్వం. మా ప్రభుత్వం ఇటీవల హైదరాబాద్ ట్రాఫిక్ నియంత్రణ కోసం ట్రాన్స్‌జెండర్‌లను నియమించాం. జీహెచ్ఎంసీ కూడా వివిధ పనుల కోసం ట్రాన్స్‌జెండర్‌లను నియమిస్తుంది.

నాణ్యమైన విద్య మా లక్ష్యం ఇందుకోసం యంగ్ ఇండియా నైపుణ్య విశ్వవిద్యాలయం, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ను తీసుకువస్తున్నాం. తెలంగాణ లో ప్రతి సంవత్సరం 1.10 లక్షల ఇంజనీర్స్ కాలేజ్ ల నుంచి వస్తున్నారు. చాలా మంది విద్యార్థులకు నైపుణ్యం ఉండడం లేదు. విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపు కోసం ఆనంద్ మహీంద్రా నేతృత్వంలో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నాం. పబ్లిక్,ప్రైవేట్ భాగస్వామ్యం లో యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నా అందరికీ ఆరోగ్యం మా లక్ష్యం. ఇవే నా ప్రధాన ఆవిష్కరణలు, గూగుల్ లాగానే, నా ప్రభుత్వంలో భాగస్వాములైన మహిళలు, యువత, రైతులు, పేదలు, మధ్యతరగతి, సీనియర్ సిటిజన్లు, పిల్లలకు ఉన్నతమైన జీవన ప్రమాణాలు కల్పించాలని కోరుకుంటున్నాం. హైదరాబాద్ లో మీ కొత్త సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్ ఏర్పాటు చేసినందుకు మరోసారి అభినందిస్తున్నాను. మేం గర్వపడేలా మీరు పనిచేస్తారని నమ్మకం ఉందన్నారు' సీఎం రేవంత్ రెడ్డి.

# డబుల్ గేమ్ వద్దు..

## ఉగ్రవాదానికి మద్దతిస్తే మూల్యం తప్పదు

తీరును మనం చూస్తున్నాము. ఇది అంతర్జాతీయంగా ద్వంద్వ వైఖరిని ప్రదర్శిస్తోంది. దీన్ని మనం అంతం చేయాలి" అని మోదీ ఉద్ఘాటించారు. గ్లోబల్ సౌత్ దేశాల ఆందోళనలను జీ-7 మరింత సీరియస్‌గా పరిగణనలోకి తీసుకోవాలని కూడా ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. అభివృద్ధి చెందుతున్న దేశాల సమస్యలు, సవాళ్లను జీ-7 దేశాలు అర్థం చేసుకుని, వాటి పరిష్కారానికి ముందుకు రావాల్సిన అవసరాన్ని ఆయన వివరించారు. అలాగే ఈ సదస్సు సందర్భంగా ప్రధాని మోదీ పలు దేశాధినేతలతో ఫలవంతమైన చర్చలు జరిపారు. ముఖ్యంగా కెనడా ప్రధాని మార్క్ కార్నీ, యూకే ప్రధాని కీర్ స్టార్మర్, ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్, దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే-మ్యుంగ్, ఇటాలియన్ ప్రధాని జార్జియా మెలోని, ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోని అల్బనీస్‌లతో కూడా సమావేశం అయ్యారు.

వాణిజ్య సంబంధాలను బలోపేతం చేసుకోవడం, ప్రపంచ సవాళ్లను ఎదుర్కోవడానికి కలిసి పని చేయడం వంటి అంశాలపై మాట్లాడారు. ముఖ్యంగా భారత్-కెనడా మధ్య సంబంధాల సాధారణీకరణకు కృషి చేస్తూ దౌత్య, వాణిజ్య సేవలను మెరుగు పరిచేందుకు కొత్త హైకమిషనర్లను నియమించడానికి రెండు దేశాలు అంగీకరించాయి. ఇది ఇరు దేశాల మధ్య ఇటీవలి కాలంలో నెలకొన్న ఉద్రిక్తతలను తగ్గించడంలో సహాయ పడుతుందని అంతా భావిస్తున్నారు. ప్రధాని మోదీ ప్రసంగం జీ-7 దేశాలపై ఉగ్రవాదంపై మరింత కఠినంగా వ్యవహరించాలనే ఒత్తిడిని పెంచింది. మరోవైపు భారత విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ దీనిపై స్పందించారు. ఎక్స్ వేదికగా ఓ పోస్టు కూడా పెట్టారు.

అందులోనే ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారతదేశ వైఖరిని ప్రధానమంత్రి వివరించారని అన్నారు. భయంకరమైన పహల్గాం ఉగ్రదాడిని ఖండించినందుకు నాయకులకు కృతజ్ఞతలు తెలిపారని పేర్కొన్నారు. అలాగే ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ప్రపంచ చర్యను వేగవంతం చేయాలని వివరించినట్లు వెల్లడించారు.

## ఇజ్రాయెల్ ఆర్థిక వ్యవస్థపై

# ఇరాన్ దాడుల దెబ్బ

ఇజ్రాయెల్ నిఘా వర్గాల అంచనాలను ఉటంకిస్తూ అమెరికా అధికారులు ఈ వివరాలను వెల్లడించినట్లు 'వాల్‌స్ట్రీట్ జర్నల్' తెలిపింది. గతవారం ఇరాన్ అణుకేంద్రాలే లక్ష్యంగా ఇజ్రాయెల్ 'ఆపరేషన్ రైజింగ్ లయన్' చేపట్టినప్పటి నుంచి ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు తారస్థాయికి చేరాయి. ఇరాన్ కూడా ఇజ్రాయెల్‌పై ప్రతీకార దాడులకు దిగింది. ఇప్పటివరకు సుమారు 400 బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించినట్లు టెహ్రాన్ ప్రకటించింది. ఈ క్షిపణులను ఎదుర్కోవడానికి ఇజ్రాయెల్ తన 'యారో సిస్టమ్', 'డేవిడ్స్ స్లింగ్' వంటి అత్యాధునిక రక్షణ వ్యవస్థలతో పాటు అమెరికా సరఫరా చేసిన 'పాట్రియాట్స్', 'థాడ్' బ్యాటరీలను కూడా మోహరించింది. అయినప్పటికీ, ఇరాన్ క్షిపణులు కొన్ని కీలక ప్రాంతాలపై పడుతుండటంతో ఇజ్రాయెల్ తీవ్రంగా శ్రమిస్తోంది.

ఈ రక్షణ వ్యవస్థల నిర్వహణ ఖర్చు ఇప్పుడు ఇజ్రాయెల్‌కు పెను భారంగా మారింది. ఒక్కో 'యారో సిస్టమ్' ఇంటర్‌సెప్టర్ విలువ సుమారు 3 మిలియన్ డాలర్లు ఉంటుందని, వీటిని ప్రయోగించి క్షిపణులను అడ్డుకుంటున్నారని 'ది మార్కర్' అనే ఇజ్రాయెల్ ఆర్థిక దినపత్రిక అంచనా వేసింది. యుద్ధం మొదలైనప్పటి నుంచి ఇరాన్ దాదాపు ప్రతిరోజూ క్షిపణులను ప్రయోగిస్తూనే ఉంది. ఈ దాడులు ఇలాగే కొనసాగితే ఇజ్రాయెల్ గగనతల రక్షణ వ్యవస్థ నిల్వలు ప్రమాదకరస్థాయికి పడిపోయే అవకాశం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అమెరికా నుంచి సకాలంలో ఆయుధ సరఫరా లేదా ఆర్థిక సాయం అందకపోతే, ఇజ్రాయెల్ రక్షణ వ్యవస్థ 10 నుంచి 12 రోజుల్లోనే బలహీనపడవచ్చని సమాచారం.

ఇరాన్ దాడుల వల్ల టెల్ అవీవ్‌లోని ఇజ్రాయెల్ సైనిక దళాల (ఐడీఎఫ్) ప్రధాన కార్యాలయం, హైఫా సమీపంలోని కీలక చమురు శుద్ధి కర్మాగారం, ఇజ్రాయెల్ నిఘా విభాగానికి సమీపంలోని ప్రాంతాలు దెబ్బతిన్నాయని తెలుస్తోంది. ఈ దాడుల్లో ఇప్పటివరకు 24 మంది మరణించారని, మరో 600 మంది గాయపడ్డారని నెతన్యాహు ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. ఇరాన్ సైనిక మౌలిక వసతులను దెబ్బతీసి విజయం సాధించామని ఇజ్రాయెల్ చెబుతున్నప్పటికీ, ఈ ప్రతిదాడులను అడ్డుకోవడానికి మాత్రం ఆ దేశం భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది.

# కూటమి గెలిచాక వారిని ఊరు విడిచి వెళ్లిపోమన్నారు

ఎన్నికల్లో కూటమికి అనుకూల ఫలితాలు వచ్చిన తర్వాత నాగమల్లేశ్వరరావు ఇంటిపై దాడులు చేసి, ఊరు విడిచి వెళ్లిపోవాలని, లేకపోతే రౌడీ షీట్ తెరుస్తామని స్వయంగా సీఐ బెదిరించారని ఆవేదన వ్యక్తం చేశారు."జూన్ 5వ తేదీ రాత్రి పోలీసులు నాగమల్లేశ్వరరావును వదిలిపెట్టగా, ఆయన నేరుగా గుంటూరులోని తన సోదరుడి ఇంటికి వెళ్లారు. అక్కడి నుంచి తన తండ్రి వెంకటేశ్వరరావుకు ఫోన్ చేసి, పోలీసులు తనను బెదిరించిన తీరును వివరించారు. పోలీసుల వేధింపుల వల్లే నాగమల్లేశ్వరరావు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. తండ్రి ఎంత ప్రయత్నించినా కుమారుడిని కాపాడుకోలేకపోయారు" అని జగన్ ఆవేదనగా చెప్పారు.

**- రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోంది**

రాష్ట్రంలో అభివృద్ధి గానీ, సంక్షేమం గానీ కనిపించడం లేదని, కేవలం 'రెడ్ బుక్ రాజ్యాంగం' మాత్రమే అమలవుతోందని జగన్ విమర్శించారు. "రాష్ట్రంలో దారుణమైన పరిస్థితులు ఉన్నాయనడానికి ఈ ఆంక్షలే నిదర్శనం. ఎన్నికల ఫలితాల సమయంలో తమకు అనుకూలమైన పోలీసు అధికారులను నియమించుకుని, కూటమిని గెలిపించుకోవడానికి అనేక అన్యాయాలకు పాల్పడ్డారు. ఈ విషయం ఈ ప్రాంత ప్రజలందరికీ తెలుసు" అని అన్నారు.నాగమల్లేశ్వరరావు ఇంటిపై దాడి చేసిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని, ఆయన తండ్రి వెంకటేశ్వరరావు ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదని జగన్ ఆరోపించారు. "నాగమల్లేశ్వరరావును బెదిరించిన ఆ సీఐపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు? భార్య, కుమార్తె ఉన్న నాగమల్లేశ్వరరావు కుటుంబానికి చంద్రబాబు ఏం సమాధానం చెబుతారు? ఘటన జరిగి ఏడాది గడిచినా ఆ కుటుంబం ఇంకా శోకంలోనే ఉంది" అని జగన్ ప్రశ్నించారు. ఇదే నియోజకవర్గంలో లక్ష్మీనారాయణ అనే మరో వైఎస్సార్‌సీపీ కార్యకర్త కూడా పోలీసుల వేధింపులు భరించలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడని, ప్రస్తుతం ఆయన చావుబతుకుల మధ్య ఉన్నాడని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు.

## బీసీ రిజర్వేషన్లకు అనుమతి తీసుకువస్తేనే

# నామినేషన్లు వేయనిస్తాం

కవిత డిమాండ్ చేశారు. ఈ ప్రాజెక్టుల వల్ల తెలంగాణ ప్రయోజనాలకు నష్టం వాటిల్లుతుందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన "ఆపరేషన్ కగార్" పైన కూడా ఎమ్మెల్సీ కవిత స్పందించారు. ఈ ఆపరేషన్‌ను తక్షణమే నిలిపివేసి, మావోయిస్టులతో శాంతియుత చర్చలు జరపాలని ఆమె కేంద్ర ప్రభుత్వానికి సూచించారు. ఎన్‌కౌంటర్లు అమానవీయ చర్యలని, ఈ ఆపరేషన్‌ను తమ పార్టీతో పాటు తెలంగాణ ప్రజలు, అన్ని రాజకీయ పార్టీలు మొదటి నుంచి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయని కవిత పేర్కొన్నారు. మావోయిస్టు సమస్యకు చర్చలే పరిష్కారమని ఆమె అభిప్రాయపడ్డారు.

# హైదరాబాద్ లో ఇల్లు, ఫ్లాట్ కొనే వారికి హైడ్రా హెచ్చరిక

హైదరాబాద్ లో ఇళ్లు, ప్లాట్లు కొనుగోలు ఊపందుకుంటుంది. ఈ క్రమంలో హైదరాబాద్ విపత్తు ప్రతిస్పందన ఆస్తి రక్షణ అథారిటీ (హైడ్రా) కీలక సూచనలు చేసింది. హైదరాబాద్ నగరంలో ఏదైనా ఇల్లు, ప్లాట్లు ఏదైనా ఆస్తి కొనుగోలు చేసే ముందు వివరాలను పూర్తిగా ధృవీకరించుకోవాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సూచనలు చేశారు. హైదరాబాద్ లో ఇళ్లు, ప్లాట్ల కొనుగోలుదారులు నగరంలో ఏదైనా ఆస్తిని కొనుగోలు చేసే ముందు వివరాలను ధృవీకరించాలన్నారు. హైదరాబాద్ లో ఆక్రమణలకు గురైన భూమిలో ఉన్న అపార్ట్‌మెంట్లు, ఇళ్లు కూల్చివేతను ఎదుర్కోవాల్సి ఉంటుందని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పష్టం చేశారు. ఆక్రమణకు గురైన నాలాపై నిర్మించిందా.? లేదా.? అనే దానితో సహా ఆస్తి వివరాలను ధృవీకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ఆదేశాల ఆధారంగా అలాంటి ఆస్తులను కూల్చి వేస్తామని ఆయన తెలిపారు. మరోవైపు హైదరాబాద్ లో నాలాల ఆక్రమణలకు సంబంధించి ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 47 పిటిషన్లు వచ్చాయని హైడ్రా ఓ ప్రకటనలో పేర్కొంది. భారీ వర్షాల నేపథ్యంలో వరద ప్రమాదాలను తగ్గించడానికి రానున్న రోజుల్లో పూడిక తొలగింపు, ఆక్రమణల నిరోధక కార్యకలాపాలు వేగవంతం కానున్నట్లు స్పష్టం చేసింది.

# టోల్ జంఝాటం నుంచి విముక్తి

కొన్ని సందర్భాల్లో ఫాస్టాగ్ రీడర్లు మొరాయించడం, సాంకేతిక లోపాలు తలెత్తుతోండటం వల్ల టోల్ ప్లాజాల వద్ద కిలోమీటర్ల కొద్దీ వాహనాలు బారులు తీరి నిల్చున్న సందర్భాలు చాలానే ఉన్నాయి. ఫాస్టాగ్ ఉన్నప్పటికీ.. వాహనాల రాకపోకలు సజావుగా సాగట్లేదనే అభిప్రాయానికి వచ్చింది కేంద్రం. దీన్ని దృష్టిలో ఉంచుకుని- మరో సరికొత్త వ్యవస్థపై దృష్టి సారించింది. కొత్తగా టోల్ పాసులను ప్రవేశపెట్టింది. వార్షిక టోల్ పాస్ ధర- 3,000 రూపాయలు. దీన్ని కొన్న తేదీ నుంచి మరుసటి ఏడాది అదే తేదీ వరకు 200 ట్రిప్పులు రాకపోకలు సాగించే వీలు వాహనదారులకు ఉంటుంది. ఈ సౌకర్యం నాన్ కమర్షియల్ వెహికల్స్ అంటే కార్లు, జీపులు, వ్యాన్లకు మాత్రమే వర్తిస్తుంది. కమర్షియల్ వాహనాలకు ఈ పాస్ వర్తించదు.

ఆగస్టు 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ వార్షిక ఫాస్టాగ్ టోల్ పాస్ ను అమలులోకి తీసుకుని రానున్నట్లు ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ వెల్లడించారు. వార్షిక పాస్ కొన్న తేదీ నుంచి ఏడాది పాటు అంటే పాస్ కొన్న తేదీ వరకు లేదా 200 ట్రిప్పులు, వీటిలో ఏది ముందుగా వస్తే అది- చెల్లుబాటు అవుతుంది. పాస్ ఉంది కదా అని టోల్ గేట్ల గుండా ఎన్నిసార్లయినా రాకపోకలు సాగించే వీలు లేదు. 200 ట్రిప్పులు మాత్రమే తిరగవచ్చు. ఎక్కడే గానీ అదనంగా టోల్ ట్యాక్స్ కట్టాల్సిన అవసరం ఉండదు. ఫాస్టాగ్ ప్రొవైడర్ అకౌంట్ లేదా వాలెట్‌లో కొంత మొత్తాన్ని తప్పనిసరిగా ఉంచుకోనక్కర్లేదు. దీనితో పాటు లైఫ్ టైమ్ టోల్ పాస్ పైనా కేంద్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. లైఫ్ టైమ్ టోల్ పాస్ ధర- 30,000 రూపాయలుగా ఉండొచ్చు. ఈ పాస్ ను యాక్టివేట్ చేయడానికి, రెన్యూవల్ చేయించుకోవడానికి అవసరమైన ప్రత్యేక లింక్ త్వరలో రాజ్‌మార్గ యాత్ర యాప్, ఎన్హెచ్ఏఐ, మోర్త్ అధికారిక వెబ్‌సైట్‌లలో అందుబాటులో ఉంటుంది.

## బ్లాక్ కాఫీలో నిమ్మరసం

# కలిపి తాగితే..?

బ్లాక్ కాఫీ తో నిమ్మరసం కలిపి తాగడం వల్ల బరువు తగ్గడానికి సహాయపడుతుందా.. అనే ప్రశ్న కు సమాధానాన్ని ఇప్పుడు తెలుసుకుందాం. ఇలా చేయడం వల్ల శరీరంలో కొవ్వును తగ్గించే ప్రక్రియ వేగవంతం అవడమే కాకుండా.. జీర్ణ వ్యవస్థ కూడా మెరుగుపడుతుంది. బ్లాక్ కాఫీలో ఉండే కెఫిన్, నిమ్మరసంలో ఉన్న విటమిన్ సి రెండూ కలిసి శరీరంలో కొవ్వు కరిగించే ప్రక్రియను వేగవంతం చేస్తాయి. ఇది బరువు తగ్గడంలో సహాయకారి అవుతుంది. శరీరం వేగంగా పని చేస్తే కేలరీలు త్వరగా ఖర్చయ్యే అవకాశం ఎక్కువ ఉంటుంది. కాఫీకి ఆస్ట్రిజెంట్ అనే లక్షణం ఉంటుంది. ఇది జీర్ణక్రియను సక్రియం చేయడంలో సహాయపడుతుంది. నిమ్మరసం కడుపులో పుల్లని రుచి కలిగి ఉండి, మలబద్ధకం, ఉబ్బరం, గ్యాస్ వంటి సమస్యలు తట్టుకోవడంలో సహకరిస్తుంది. కాబట్టి బ్లాక్ కాఫీతో నిమ్మరసం తాగితే కడుపు శుభ్రంగా, నిదానంగా ఉంటుంది.ప్రతి ఉదయం బ్లాక్ కాఫీకి నిమ్మరసం కలిపి తాగడం వల్ల శరీరం చురుకుగా మారుతుంది. ఇది మనోస్థితిని మెరుగుపరచడమే కాకుండా.. ఆలోచనలు కూడా తేలికగా ఉంటాయి. అలసట, నిరాశ వంటి భావాలు తగ్గిపోతాయి. అందువల్ల రోజంతా ఉత్సాహంగా ఉండటానికి ఇది ఉపయోగపడుతుంది.నిమ్మరసంలో యాంటీఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. అవి చర్మంలోని దూషిత పదార్థాలను తొలగించి చర్మాన్ని సున్నితంగా, ప్రకాశవంతంగా చేస్తాయి. బ్లాక్ కాఫీ కూడా శుభ్రపరిచే లక్షణం కలిగి ఉండటంతో చర్మం బాగుంటుంది. కాఫీతో నిమ్మరసం కలిసి చర్మానికి ఆరోగ్యం ఇస్తాయి. నిమ్మరసంలోని విటమిన్ సి శరీర రోగ నిరోధక వ్యవస్థను బలపరుస్తుంది. కాఫీలో ఉండే యాంటీఆక్సిడెంట్లు శరీరానికి ఇన్ఫెక్షన్లు తట్టుకునే శక్తిని కలిగిస్తాయి. ఈ రెండు కలిపితే మీరు జ్వరాలు, జలుబులు వంటి వ్యాధులు ఎదుర్కోవడంలో బలం పొందగలుగుతారు. కొన్ని సందర్భాలలో నిమ్మరసం కలిపిన బ్లాక్ కాఫీ తాగడం వల్ల మైగ్రేన్ వేదనకు ఉపశమనం లభిస్తుంది. తలనొప్పులు తక్కువగా వచ్చేవిధంగా ఇది సహాయం చేస్తుంది. వ్యాయామానికి ముందు బ్లాక్ కాఫీకి నిమ్మరసం కలిపి తాగితే శక్తి ఎక్కువగా ఉంటుంది. దీని వల్ల మీరు ఎక్కువ సమయం చురుకుగా ఉండవచ్చు. శరీరం ఎక్కువ కేలరీలను దహనం చేయడంలో సహాయపడుతుంది.

## ఔట్డోర్ అడ్వర్టైజింగ్‌పై ప్రభుత్వం

# సమగ్ర ప్రకటనల విధానం ప్రకటించాలి

**– ఔట్డోర్ మీడియా ఓనర్స్ అసోసియేషన్ డిమాండ్**

**హైదరాబాద్** ప్రస్తుత పరిస్థితుల్లో ఔట్డోర్ అడ్వర్టైజింగ్ పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారించాలని,, తెలంగాణలో సమగ్ర ప్రకటనల విధానం ప్రకటించాలని ఔట్డోర్ మీడియా ఓనర్స్ అసోసియేషన్ (అడ్వర్టైజింగ్ పరిశ్రమ) తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. బుధవారం హైదరాబాద్ లో ఏర్పతుచిసిన మీడియా సమావేశం లో అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ మాకు సమగ్ర ప్రకటనల విధానం కావాలని, అన్ని రకాల ఏజెన్సీలను సమానంగా పరిగణించేలా పాలసీ ఉండాలని కోరారు. హోర్డింగ్ల పరిమాణం, ఎత్తుపై పరిమితులు.జనాభా వారీగా పన్ను వసూలు.అన్ని టెండర్లు పారదర్శకతతో, బహిర్గతంగా ఉండాలని కోరారు.. 5 సంవత్సరాల కాలానికి అనుమతులు ఇవ్వాలి ఏజెన్సీలకు వ్యాపార రుణాలు అందించాలిని, అన్ని ఏజెన్సీలకు సమాన అవకాశాలను కల్పించాలని విజ్ఞప్తి చేసారు. జీహెచ్ఎంసీ పరిధిలో రికార్డుల ప్రకారం మొత్తం 2,400 హోర్డింగులు ఉన్నాయి. ఈ హోర్డింగ్లపై ప్రకటనల ద్వారా జీహెచ్ఎంసీకి ఏడాదికి రూ.30 కోట్ల ఆదాయం సమకూరేది. ప్రకటనల పన్నులు కాకుండా, హెచ్ఎండీఏ, వాటర్ వర్క్స్, పోలీస్ డిపార్ట్మెంట్ వంటి ప్రభుత్వ విభాగాలు మా వంటి ప్రకటనల ఏజెన్సీలకు హోర్డింగ్ ఏర్పాటుకు ప్రోపర్టీని లీజుకు ఇవ్వడం ద్వారా జీహెచ్ఎంసీ అదనంగా మరో రూ.10 కోట్ల ఆదాయాన్ని ఆర్జించేది. 2005 తర్వాత జీహెచ్ఎంసీ పరిధులు విస్తరించాయి. కానీ, విస్తరించిన ప్రాంతాలలో కొత్త హోర్డింగ్ల ఏర్పాటుకు అనుమతులు జారీ చేయలేదు. జీహెచ్ఎంసీ (ఓఆర్ఆర్) వరకు విస్తరించిన పరిధుల వరకు అనుమతులు ఇచ్చి ఉంటే ఇప్పటికి ఇంచుమించుగా 10,000 హోర్డింగ్లు అందుబాటులో ఉండాలి. వీటి ద్వారా తెలంగాణ ప్రభుత్వానికి ప్రకటనల పన్ను ఆదాయం సుమారు రూ.250 కోట్ల నుంచి రూ.300 కోట్ల వరకు రాబడి ఉండేది.

జీహెచ్ఎంసీ పరిధిలో 2020కి ముందు రిజిస్టర్ అయిన అడ్వర్టైజింగ్ ఏజన్సీల సంఖ్య 209గా ఉండగా, రిజిస్టర్ కాని ఏజెన్సీలు 200 వరకు ఉన్నాయి. గత ప్రభుత్వం 2020 ఏప్రిల్ 20న జీవో నంబర్ 68 తీసుకురావడంతో జీహెచ్ఎంసీ పరిధుల్లోని అన్ని హోర్డింగ్లను తొలగించారు. ఫలితంగా హోర్డింగ్ ప్రకటన ఆదాయం సున్నాకు పడిపోయింది. పర్యావసానంగా 209 రిజిస్టర్డ్, 200 రిజిస్టర్డ్ కాని ఏజెన్సీలకు ఉపాధి లేకుండాపోయింది.ఏజెన్సీలు దివాలా తీయాల్సి వచ్చిందని వారు ఆవేదన వ్యక్తం చేసారు.జీవో నంబర్ 68 జారీ చేసిన తర్వాత, హోర్డింగ్స్ మినహా ఇతర మాధ్యమాల ద్వారా జీహెచ్ఎంసీ సుమారుగా రూ.8-10 కోట్ల (బస్ షెల్టర్లు, మెట్రో మీడియా, పాదాచార వంతెనలు (ఫోబ్స్ ), గొడుగులు) ఆదాయం మాత్రమే పొందింది. అయితే, కొన్ని చట్టపరమైన సమస్యల కారణంగా ఈ రాబడిని కూడా జీహెచ్ఎంసీ ప్రస్తుతం కోల్పోతోందని వారు తెలిపారు.

# యోగాతో ఏకాగ్రత

యోగా మన శరీరానికి మేలు చేయడంతో పాటు ఏకాగ్రత పెరగడం, మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం పొందవచ్చని ప్రతి ఒక్కరి జీవితంలో యోగా ను క్రమం తప్పకుండా కొనసాగించాలని అప్పుడే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు.శ్రీకాళహస్తి నియోజకవర్గం లోని శ్రీకాళహస్తి ఆలయం, గాలిగోపురం దగ్గర ఏర్పాటు చేసిన అంతర్జాతీయ యోగాంధ్ర దినోత్సవం కార్యక్రమంలో భాగంగా యోగాంధ్రబి2025 కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ , శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి, బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, పర్యాటకశాఖ రీజనల్ డైరెక్టర్ రమణ ప్రసాద్ తో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. యోగా వలన శరీరానికి మేలు చేయడంతో పాటు ఏకాగ్రత పెరగడం మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం పొందవచ్చని అప్పుడే ప్రతి ఒక్కరు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. యోగాంధ్ర కార్యక్రమాలు రాష్ట్ర వ్యర్థంగా, జిల్లా వ్యాప్తంగా చేసుకుంటున్నాము అని యోగాంధ్రలో భాగంగా యోగా ను ప్రతి ఒక్క ఇంటికి ప్రతి ఒక్క మనిషికి చేరవేసేలాగా గౌరవ ముఖ్యమంత్రి గారు జిల్లా అధికారులకు ప్రజా ప్రతినిధులకు అందరికీ ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. మన జిల్లాలో సుమారుగా తొమ్మిది లక్షల మంది పైగా యోగా లో రిజిస్ట్రేషన్ చేయడం జరిగింది. రిజిస్ట్రేషన్ చేసిన ప్రతి ఒక్కరికి యోగా మీద శిక్షణ ఇవ్వడం జరిగింది అని అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం రోజున కూడా ప్రతి ఒక్క చోట ప్రతి ఒక్క ఇంట్లో, ప్రతి ఒక్క గ్రామం, సచివాలయం పరిధిలో మండల పరిధిలో నియోజకవర్గ పరిధిలో జిల్లా స్థాయి పరిధిలో అన్ని చోట్ల కూడా 21వ తారీఖున చాలా పెద్ద ఎత్తున యోగా కార్యక్రమం చేయబోతున్నాము అని తెలిపారు.

## ప్రేమ వ్యవహారం..యువకుడి కిడ్నాప్ కేసులో

### తమిళనాడు ఏడీజీపీ సస్పెన్షన్.. సుప్రీంకోర్టు సీరియస్ కామెంట్స్

**న్యూ ఢిల్లీ** తమిళనాడు రాష్ట్రం తిరువళ్లూరు జిల్లా కళంబాక్కంకు సంబంధించిన ఓ ప్రేమ వ్యవహారంలో యువకుడి కిడ్నాప్ తీవ్ర దుమారానికి దారితీసింది. ఈ కేసులో మద్రాస్ హైకోర్టు ఆదేశాల మేరకు ఏడీజీపీ (ంఆఉఖ) జయరామ్ ను అరెస్టు చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం ఆయనను విధుల నుంచి సస్పెండ్ చేసింది.దీనిపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ఓ సీనియర్ పోలీసు అధికారి విచారణలో పాల్గొన్నందుకు ఆయనను ఎలా సస్పెండ్ చేస్తారంటూ తమిళనాడు ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఆయనను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఆదేశించింది. వివరాల్లోకి వెళ్తే.. కళంబాక్కంకు చెందిన ఓ యువకుడు ఇటీవల తేనికి చెందిన యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు.కొన్ని రోజుల తర్వాత ఆ యువకుడి 16 ఏళ్ల సోదరుడు కిడ్నాప్ అయ్యాడు. ఈ కిడ్నాప్ వ్యవహారంలో ఏడీజీపీ జయరామ్‌కు సంబంధం ఉందని ఆరోపణలు వచ్చాయి. ఈ కేసుకు సంబంధించి ఇటీవల విచారణ జరిపిన మద్రాస్ హైకోర్టు ఏడీజీపీని అరెస్టు చేయాలని ఆదేశాలు ఇచ్చింది. దాంతో పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు.ఈ క్రమంలో ఏడీజీపీ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అరెస్టైన వారు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా ఏడీజీపీ హోదాలో ఉన్న తనను అరెస్టు చేశారని ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై సుప్రీంకోర్టు బుధవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా తమిళనాడు ప్రభుత్వ కౌన్సిల్ వాదనలు వినిపించారు.ఏడీజీపీని కస్టడీలోకి తీసుకుని విచారణ అనంతరం మంగళవారం సాయంత్రమే విడుదల చేశామని ఆయన సుప్రీంకోర్టుకు తెలిపారు. అయితే తనను పోలీసులు విడుదల చేసినప్పటికీ ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేసిందని ఏడీజీపీ వాదించారు. దాంతో సుప్రీం ధర్మాసనం అసహనం వ్యక్తంచేసింది. ఆయనొక సీనియర్ పోలీసు అధికారి అని, ఆయయను సస్పెన్షన్‌లో పెట్టాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించింది.ఈ కేసులో హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు ఆశ్యర్యం కలిగించాయని వ్యాఖ్యానించింది. ఆ ఉత్తర్వులు నిరుత్సాహపరిచేలా ఉన్నాయని కోర్టు ఆగ్రహించింది. గురువారం నాటికి ఏడీజీపీపై సస్పెన్షన్‌ను రద్దు చేసి.. ఆ సమాచారాన్ని న్యాయస్థానానికి తెలియజేయాలని ఆదేశించింది.

## బాలికపై సామూహిక అత్యాచారం..

# చెట్టుకు ఉరేసి హత్య

**ఒడిశా** బాలికపై సామూహిక అత్యాచారానికి పాల్పడి, ఆపై ఆమెను చెట్టుకు ఉరేసి చంపిన ఘటన ఒడిశా రాష్ట్రం కియోంఝర్ జిల్లాలోని గోపాల్‌పూర్ ఏరియాలో ఆదివారం చోటుచేసుకుంది. ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. ముగ్గురు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

గోపాల్‌పూర్ ఏరియాలోపి టెంట్‌లపాషీ గ్రామానికి చెందిన 17 ఏళ్ల బాలిక ఇంటర్మీడియట్ చదువుతోంది. ఆదివారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె తిరిగిరాలేదు. దాంతో అంతా వెతికిన కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదుచేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులకు గ్రామ శివార్లలోని పొలాల్లో చెట్టుకు వేలాడుతూ బాలిక మృతదేహం కనిపించింది.ఘటనా ప్రాంతాల్లో లభించిన మొబైల్ ఫోన్, దుస్తుల ఆధారంగా ముగ్గురు అనుమానితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ముగ్గురు నిందితులు బాలికకు తెలిసినవారేనని పోలీసుల దర్యాప్తులో తేలింది. బాలిక పోస్టుమార్టం నివేదిక వస్తే కేసు దర్యాప్తు సులువయ్యే అవకాశం ఉందని అన్నారు.

# పోలీసులతో అంబటి వాగ్వాదం

**గుంటూరు** గుంటూరు జిల్లా సత్తెనపల్లి కంటేపూడి వద్ద వైసీపీ మాజీ మంత్రి అంబటి రాంబాబు హడావుడి చేశారు.

భారీ ర్యాలీతో వచ్చి, పోలీసుల బ్యారికేడ్లను తొలగించి వారితో వాగ్వాదానికి దిగారు. వాహనాలు ర్యాలీగా వెళ్లేందుకు అనుమతి లేదని పోలీసులు తెలిపినప్పటికీ బ్యారికేడ్లను తొలగించి చొచ్చుకెళ్లేందుకు అంబటి రాంబాబు ప్రయత్నించారు.

# సింగయ్య మృతిపై విచారణ

**గుంటూరు** మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి సత్తెనపల్లి వెళ్తుండగా ఏటుకూరు బైపాస్ వద్ద కాన్వాయ్ ముందు వెళ్తున్న ప్రైవేటు వాహనం ఢీకొని చీలి సింగయ్య ప్రమాదానికి గురయ్యారని గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ తెలిపారు. గుంటూరు రూరల్ మండలం వెంగళయపాలెంకు చెందిన సింగయ్య జగన్ పర్యటనను చూసేందుకు ఏటుకూరు బైపాస్ వద్దకు వచ్చారు.జగన్ కాన్వాయ్ వచ్చిన సమయంలో ఎదురుగా ఉన్న ప్రైవేటు వాహనం సింగయ్యని ఢీ కొట్టింది దీంతో సింగయ్య రోడ్డుపై పడిపోయాడు. అతనిని అక్కడి వారు పక్కనే ఉన్న డివైడర్పై పడుకోబెట్టి వెళ్లిపోయారు. హైవే పోలీసులు అతనిని ఆసుపత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు నిర్ధారించారు. దీనిపై విచారణ జరుగుతుందని అలానే ఎవరైనా ఫిర్యాదు చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్పీ సతీష్ కుమార్ తెలిపారు

# సాగులో యాంత్రీకరణకు ప్రోత్సాహం

**తిరుపతి** రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటుందని,సాగులో యాంత్రీకరణను ప్రోత్సహిస్తూ యంత్రపరికరాలు, డ్రోన్లు అందిస్తున్నామన్నారు తిరుపతి వెంకటేశ్వర్.జిల్లాలోని 1678 చిన్న సన్న కారు రైతులకు వ్యవసాయ యంత్ర పరికరములను రాయితీపై రూ 2,67,26,984/-లు చెక్కును వ్యవసాయ అదికారి ప్రసాద్ తో కలసి పంపిణి చేసి రైతులతో సమీక్షా సమవేశం నిర్వహించారు.స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫిరేన్స్ హాలు నందు వ్యవసాయ శాఖదికారులతో కలసి రాష్ట్ర ప్రభుత్వం రైతులను, వ్యవసాయ రంగాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటుందని, సాగులో యాంత్రీకరణను ప్రోత్సహిస్తూ యంత్రపరికరాలు, డ్రోన్లు అందిస్తున్నామన్నారు. జిల్లాలోని 1678 చిన్న సన్న కారు రైతులకు వ్యవసాయ యంత్ర పరికరములను రాయితీపై రూ 2,67,26,984/-లు చెక్కును జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ వ్యవసాయ శాఖ అదికారితో కలసి పంపిణి చేసి రైతులతో సమీక్షా సమవేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయం మీద వ్యవసాయ శాఖ మీద ప్రత్యేక దృష్టి పెడుతుందని , దానిలో బాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి సాంకేతిక పరిజ్ఞానంతో ముందు చూపుతో వెళ్తున్నారని తెలిపారు . గతంలో 2018-19 ముందు రైతులకు యంత్రపరికరాలను సబ్సిడీపై అందించారని తెలిపారు. ఇప్పుడు ఖరీఫ్ సీజన్ కు ముందుగానే మన జిల్లాలో 1678 చిన్న సన్న కారు రైతులకు సుమారుగా 6 కోట్లు విలువగల వ్యవసాయ యంత్ర పరికరములను అందించడం జరిగిందన్నారు . అందులో రాయితీ కింద రూ 2,67,26,984/-లు రైతులకు అందిస్తున్నామన్నారు. అలగే మీ ద్వారా కూడా సూచనలను సలహాలను తీసుకోవడం జరిగిందన్నారు.

## యోగా డేను విజయవంతం చేయాలి

**విశాఖపట్నం** విశాఖలో పెద్ద ఎత్తున ఏర్పాట్లు: ప్రపంచం మొత్తం విశాఖ వైపు చూసేలా నిర్వహిస్తున్న యోగా వేడుకలో అందరూ పాల్గొనాలని మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి పిలుపునిచ్చారు. ప్రపంచ యోగా దినోత్సవానికి విశాఖలో పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రవాణా, ఆహార సౌకర్యాలు ప్రణాళిక ప్రకారం సిద్ధం చేస్తున్నామని తెలిపారు.ట్రాఫిక్ సమస్య లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని అలానే ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. విశాఖ ఒక గ్లోబల్ ఈవెంట్ కి వేదిక అయిందని,దేశ ప్రధాని నరేంద్ర మోడీ ముఖ్య అతిథిగా పాల్గొననున్నారని రెవెన్యూ మినిస్టర్ అనగాని సత్య ప్రసాద్ తెలిపారు.యోగ డే తో విశాఖ కి ప్రపంచ గుర్తింపు వస్తుందని,వెల్త్, హెల్త్, హ్యాపీ ఆంధ్రప్రదేశ్ కాన్సెప్ట్ తో రాష్ట్ర ప్రభుత్వం యోగా ఆంధ్రా నిర్వహించబోతుందని,5 లక్షల మంది ప్రజలు ప్రత్యక్షంగా పాల్గొంటున్నారని చెప్పారు.దానికి తగ్గట్టుగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని వెల్లడించారు.

## నీతి వ్యాఖ్యలు వల్లిస్తున్న కేటీఆర్.. తిట్టుకుంటున్న ముసలివాళ్ళు

**– ఫిషరీష్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమ్నార్**

**హైదరాబాద్** నీతి వ్యాఖ్యలు వల్లిస్తున్న కేటీఆర్ ను చూసి భార్య భర్తల ఫోన్లు ఎలా వింటాడని కేటీఆర్ ను 65 ఏండ్ల ముసలివాళ్ళు తిడుతున్నారని ఫిషరీష్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ విమర్శించారు. బుదవారం గాంధీ భవన్ లో మీడియా సమావేశం లో మాట్లాడుతూ తెలంగాణ ప్రజల పరువు బజారున పడేసినందుకు కల్వకుంట్ల కుటుంబానికి నోటీసులు ఇవ్వాలని డిమాండ్ చేవ్వారు.కేటీఆర్ నోరు తెరిస్తే అబద్ధమే మాట్లాడుతాడని,బీఆర్ఎస్ పార్టీ అనేది గతంరేవంత్ రెడ్డి అరగంట బీఆర్ఎస్ గురించి ఆలోచిస్తే ఆ పార్టీలో నలుగురు తప్పా ఎవరూ ఉండరన్నారు.కేటీఆర్ కి ఇంగ్లీష్ ఫుల్... సబ్జెక్టు నిల్ కల్వకుంట్ల కుటుంబం రేవంత్ పేరును కోటి సార్లు పలికి ఉంటారు కల్వకుంట్ల కుటుంబం కల్వ కుట్రల కుటుంబం కేటీఆర్ చీప్ గా చిల్లరగా మాట్లాడుతాని ఎద్దేవా చేసారు.

## నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని ఎదగాలి.





**జగిత్యాల** విద్యార్థులు మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుపుచ్చుకొని జీవితంలో ఉన్నత స్థానం సాధించాలని ఆర్ఎస్ఎస్ జిల్లా సంఘచాలక్, ఐఎంఏ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆకుతోట శ్రీనివాసరెడ్డి అన్నారు. వాల్మీకి ఆవాసం సేవా భారతి ద్వారా నిర్వహిస్తున్న ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రంలో రెండవ బ్యాచ్ శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యశస్వి ఎంటర్ప్రైజెస్ అధినేత కోటగిరి శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ రంగు గోపాల్ హాజరుకాగా ప్రధాన వక్తగా డాక్టర్ ఆకుతోట శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ సేవా విభాగం సేవా భారతి ద్వారా దేశవ్యాప్తంగా 1,70,000 సేవా కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. వాల్మీకి ఆవాసం ద్వారా ఉచిత ట్యూషన్ సెంటర్లు, బాల సంస్కార కేంద్రాలు, కుట్టు శిక్షణ కేంద్రం తో పాటు ఉచిత కంప్యూటర్ శిక్షణను అందించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరికి ఉద్యోగాలు కల్పించడం ఏ ప్రభుత్వం వల్ల కూడా సాధ్యం కాదని యువత తమ నైపుణ్యాలను పెంచుకొని స్వయం ఉపాధి కోసం ప్రయత్నించాలన్నారు. మనదేశంలో నైపుణ్యం గల యువత ఎంతో మంది ఉన్నారని వారు తమ స్టార్టప్ ల ద్వారా వందలాది మందికి ఉపాధి కల్పిస్తున్నారని తెలిపారు. కంప్యూటర్ దశ దాటి ప్రస్తుతం ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్) యుగం నడుస్తుందని ఆ దిశగా యువత తమ నైపుణ్యాలకు మరింత పదును పెట్టి జీవితము లో ఎదగాలని సూచించారు. వాల్మీకి ఆవాసం ద్వారా నిర్వహిస్తున్న ఉచిత కంప్యూటర్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి ఆవాస ప్రధాన కార్యదర్శి నందెల్లి మదన్మోహన్ రావు, కమిటీ సభ్యులు అశోక్ రావు,బెజ్జంకి సంపూర్ణ చారి, ఎలగందుల కైలాసం, గౌరిశెట్టి హరీష్, శిక్షణ కేంద్రం ఇంచార్జ్ సత్యం, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పాలనలో మెడికల్ కళాశాలల

# భవిష్యత్ గందరగోళం

- పాలన వదిలేసి ప్రతీకార చర్యలతోనే ఈ దుస్థితి.
- ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కళ్ళు తెరవాలి.
- జిల్లా పరిషత్ తొలి చైర్ పర్సన్ దావ వసంత



**జగిత్యాల :** జగిత్యాల మెడికల్ కాలేజీలో మౌలిక వసతులు లేక జాతీయ వైద్య మండలి నోటీసులు జారీ చేయాదంతోనే రాష్ట్రంలోని మెడికల్ కళాశాల ల పరిస్థితి గందరగోళంగా మారిందని తాజా మాజీ జడ్పి చైర్మన్ దావ వసంత అన్నారు. జగిత్యాల జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేఖరుల సమావేశంలో మాజీ జడ్పీ చైర్పర్సన్ దావ వసంత సురేష్ మాట్లాడారు. ఈ సందర్భంగా వసంత మాట్లాడుతూబిఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో ముందు చూపుతో ప్రారంభించిన ప్రభుత్వం మెడికల్ కాలేజీల భవితవ్యం రేవంత్ రెడ్డి పాలనలో ప్రశ్నార్థకంగా మారిందనీ అన్నారు. జగిత్యాల జిల్లా మెడికల్ కాలేజ్ కు నోటీసులు రావడం సిగ్గుచేటు అని అన్నారు. జగిత్యాల జిల్లా మెడికల్ కాలేజీ తో పాటు 26 మెడికల్ కాలేజీల్లో నిబంధనలకు అనుగుణంగా సౌకర్యాలు వసతులు లేకపోవడంపై ఈ నెల 18 న ఎన్. ఎమ్. సి ముందు ప్రత్యక్షంగా హాజరుకావాలని హెల్త్ సెక్రటరీ, డీఎంఈ కి నోటీసులు ఇవ్వడం ఈ కాంగ్రెస్ ప్రభుత్వం చేతగానితనానికి నిదర్శనం అని అన్నారు. 2014లో స్వరాష్ట్రం ఏర్పడ్డ నాటికి తెలంగాణలో ఐదు ప్రభుత్వ ,15 ప్రైవేట్ మెడికల్ కాలేజీలు వాటిలో 2850 ఎంబిబిఎస్ సీట్లు మాత్రమే ఉండేవి అని అన్నారు తెలంగాణ ఏర్పాటు అనంతరం తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఒక్కో జిల్లాకు ఒక్క మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయడంతో 2023 అక్టోబర్ నాటికి మొత్తం కళాశాలల సంఖ్య 56 సీట్ల సంఖ్య 8340 కి చేరింది అప్పటికి కెసిఆర్ ప్రభుత్వం మరో 8 మెడికల్ కాలేజ్లు మంజూరు చేయడంతో మొత్తం సీట్ల సంఖ్య 9140 కి చేరిందన్నారు. కానీ కెసిఆర్ సంకల్పానికి ఈ కాంగ్రెస్ ప్రభుత్వం తూట్లు పోడుస్తుందని అన్నారు. వైద్య కళాశాలలో కనీసం వసతులు కల్పించలేని దుస్థితిలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఉందని అన్నారు.కెసిఆర్ నాయకత్వంలో మొదటి జగిత్యాల మెడికల్ కాలేజ్ కు పెర్మిషన్ వచ్చింది ఇవాళ కనీసం కనీస అవసరాలు లేని దుస్థితి ఈ కాంగ్రెస్ ప్రభుత్వం లోఎందుకు వచ్చింది ఇప్పుడు ఉన్న నాయకులు ఎందుకు నోరు మెదపడం లేదు అని ప్రశ్నించారు. అప్పట్లో జగిత్యాల జిల్లాకు మెడికల్ కాలేజీ వస్తదా అని అన్న నాయకులు కేసీఆర్ సారధ్యంలో కల్వకుంట్ల కవితక్క కృషి తో జగిత్యాల జిల్లాకు మెడికల్ కాలేజీని సాధించుకున్నామని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అప్పటి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్ రావు హయాంలో మెడికల్ కాలేజీకు అన్ని అనుమతులు సాధించుకున్నామని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 18 నెలలైనా కూడా కేసీఆర్ గారిని విమర్శిస్తూనే ఉన్నారు కానీ పాలన మీద దృష్టి సాదించడం లేదని అన్నారు. రేవంత్ రెడ్డి పాలనను గాలికి వదిలేసి ప్రతికార రాజకీయాలు చేస్తున్నారని ఇప్పటికైనా కళ్ళు తెరిచి జగిత్యాల జిల్లా మెడికల్ కాలేజీకి కావలసిన నిధులు విడుదల చేసి, మౌలిక సదుపాయాలు కల్పించి ఎన్. ఎమ్. సి నిబంధనలకు అనుగుణంగా అన్ని సౌకర్యాలు కల్పించి విద్యార్థి జీవితాలను నిలబెట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాక్స్ చైర్మన్ మహిపాల్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ మహేష్, మాజీ కౌన్సిలర్ దేవేందర్ నాయక్, సీనియర్ నాయకులు వెంకటేశ్వర్ రావు, రిజ్వాన్, అనురాధ, బాలే చందు తదితరులు పాల్గొన్నారు.

## భూ సమస్యలపై వచ్చిన ప్రతి దరఖాస్తు పరిష్కారానికి కృషి

**జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్**



**జగిత్యాల :** :రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యల పై వచ్చిన ప్రతి దరఖాస్తు పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ అన్నారు.శుక్రవారం మేడిపల్లి మండలంలోని కట్లకుంట గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులను కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను త్వరగా ఫీల్డ్ విచారణ పూర్తి చేసే పరిష్కరించాలని అన్నారు. వచ్చిన దరఖాస్తులలో విచారణ పూర్తయిన వాటిని వెంటనే ఆన్ లైన్ లో నమోదు చేయాలని అన్నారు.రెవెన్యూ సదస్సులలో వచ్చిన ప్రతి దరఖాస్తుకు వాటి పూర్తి వివరాలు తీసుకోవాలని, భూ భారతి చట్ట ప్రకారం వాటి పరిష్కారానికి పకడ్బందీ చర్యలు చేపట్టాలని అన్నారు.ఆంతకుముందు మేడిపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ పరిశీలించారు.ఈ సంధర్భంగా పదవ తరగతి విద్యార్థులు ఉపాధ్యాయులతో మాట్లాడారు పాఠ్యాంశం బోధన (ఐఎఫ్పీ) ఇంటర్ యాక్ట్ ప్లాంట్ ప్యానల్ ద్వారా విద్యార్థులకు బోధించేటప్పుడు తరగతి గదిలో విద్యార్థులతో కూర్చొని జిల్లా కలెక్టర్ విద్యా బోధన ను గమనించారు .పాఠశాల విషయాల గురించి విద్యార్థులను, ఉపాధ్యాయులకు అడిగి తెలుసుకున్నారు.వంటగది సామాగ్రి పప్పు దినుసులు వంట నూనె సంబంధించినవి నాణ్యత పరిమాణాలతో ఉండాలని, పిల్లలకు మంచి భోజనం అందించాలి సూచించారు.. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని నీరు నిలువ ఉండకుండా చూడాలని ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండేలా చూడాలని పాఠశాల ఉపాధ్యాయులకు జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డిఈవో రామ్, కోరుట్ల ఆర్డీవో జివాకర్ రెడ్డి,తహసిల్దార్ మునీందర్,ఎంపీడీవో పద్మావతి,సంబంధిత అధికారులు, రైతులు,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## అనువంశిక రక్తరుగ్మత 'సికిల్ సెల్ అనీమియా'

తల్లితండ్రుల నుంచి సంక్రమించే జన్యులోప రుగ్మతగా "సికిల్ సెల్ రక్తహీనత" ప్రమాదకరంగా మారుతోంది. శరీర కణజాలానికి ప్రాణవాయువు, ఆక్సీజన్‌ను అందించే రక్తంలోని ఎర్ర రక్త కణాలతో కూడిన హీమోగ్లోబిన్ ఉపకరిస్తుంది. ఆక్సీజన్‌ను సరఫరా చేస్తున్న ఎర్ర రక్త కణాలు గుండ్రంగా, మృదువుగా, ఫ్లెగ్జిబుల్‌గా ఉంటూ రక్త నాళాల గుండా సులభంగా ప్రవహిస్తూ, మన ఆరోగ్యానికి పునాదులు వేస్తున్నాయి. సికిల్ సెల్ రుగ్మత బారిన పడిన వ్యక్తుల ఎర్ర రక్త కణాలు దృఢంగా, గట్టిగా, అంటుకునే గుణంతో, సి-ఆకారంలో కొడవలి లేదా సికిల్ ఆకారంలో ఉంటాయి. ఆ సికిల్ కణాలు రక్తనాళాల్లో సులభంగా ప్రవహించకుండా, త్వరగా చనిపోతూ ఉంటాయి. ఇలాంటి సికిల్ సెల్ రుగ్మత ఉన్న వారిలో దీర్ఘకాలిక రక్తహీనత, నొప్పులు, అవయవాలకు హాని, ఇతర తీవ్రమైన అనారోగ్యాలను కలిగిస్తుంది. దీనినే సికిల్ సెల్ రుగ్మతగా పిలవడం జరుగుతోంది. సికిల్ సెల్ రక్త రుగ్మత పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడం, ముందస్తు పరీక్షలతో గుర్తించడం, వ్యాధిగ్రస్తుల పట్ల జాగ్రత్తలు తీసుకోవడం, రోగుల కుటుంబాల్లో ఆత్మ విశ్వాసం పెంచడం లాంటి కార్యక్రమాలను నిర్వహించడానికి ఐరాస ఆమోదంతో ప్రతి ఏట 19 జూన్ రోజున "ప్రపంచ సికిల్ సెల్ అవగాహన దినం (వరల్డ్ సికిల్ సెల్ అవేర్‌నెస్ డే)" పాటించడం ఆనవాయితీగా మారింది.

# జగమెరిగిన మిమిక్రీ కళాకారుడు

భారత దేశంలో మిమిక్రీ కళకు ఆయన ఆద్యుడు. ఎంతో మంది ప్రముఖుల వందలాదిగా గొంతులను సునాయాసంగా, యథాతథంగా అనుకరించేవారు. భారత్‌లో అనుకరించి, నవ్వించే కళగా మాత్రమే ఉన్న మిమిక్రీని ఐక్య రాజ్య సమితి ప్రధాన కార్యాలయంలో ప్రదర్శించే స్థాయికి తీసుకెళ్లిన గొప్ప కళాకారుడు. రాష్ట్రపతులు, ప్రధానుల నుండి సామాన్యుల వరకూ దేశంలో ఆయన అపూర్వ, అపురూప కళను అభినందించని వారుండ రంటే అతిశయోక్తి కాదు. ఇప్పుడు గుర్తు పట్టారనుకుంటా. ఆయనే వందలాది గొంతుకల వేణు మాధవుడు. ధ్వన్యనుకరణ సామ్రాట్ అనే బిరుదును పొందిన, తెలంగాణ గర్వించ దగ్గ ప్రపంచ ప్రఖ్యాత మిమిక్రీ కళాకారుడు నేరెళ్ళ వేణుమాధవ్ ( డిసెంబరు 28, 1932 – జూన్ 19, 2018 ) చిన్నప్పుడు ఉర్దూ మాధ్యమంలో చదువుకున్నారు. అయినా ఆయన అమెరికా, బ్రిటన్ ఇంగ్లిష్ ఉచ్చారణలతో కూడా గొప్ప ప్రదర్శనలు ఇచ్చారు. ఆయన సొంతంగా ఈ కళను సాధన చేశారు. స్వీయ పరిశీలన, స్వయం అధ్యయనంతో తనను తాను మెరుగు పరచు కుంటూ అత్యున్నత స్థాయిని అందుకున్న ప్రతిభాశాలి. చిన్నతనంలో చిలకమర్తి లక్ష్మీ నరసింహం రాసిన ప్రహసనాల్లో నటించి తన ప్రతిభను చాటుకున్నా అప్పటి ప్రముఖ నటులు చిత్తూరు నాగయ్య, వేమూరు గగ్గయ్య, మాధవపెద్ది వెంకట్రామయ్య తదితరుల సినిమాల ప్రభావంతో మిమిక్రీ కళపై మొగ్గు చూపారు. 1947 నుంచి ఈయన మిమిక్రీ ప్రదర్శనలు ఇవ్వడం ప్రారంభించారు. తెలుగు లోనే కాక ఇతర భాషల్లో కూడా ప్రదర్శనలు ఇచ్చారు. ఐక్యరాజ్య సమితిలో కూడా ప్రదర్శన ఇచ్చారు. 1953 లో ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించారు. కేంద్ర ప్రభుత్వం ఆయనకు పద్మశ్రీ పురస్కారాన్నిచ్చి గౌరవించింది..కవిసామ్రాట్ విశ్వనాథ సత్య నారాయణ, జ్ఞాన పీఠ అవార్డు గ్రహీత సినారె మొదలైన ప్రముఖులు తమ రచనలను ఆయనకు అంకిత మివ్వడం ఆయన గొప్ప తనాన్ని స్పష్టం చేస్తుంది. ఆంధ్ర విశ్వ విద్యాలయం నుంచి కళా ప్రపూర్ణ, జె. ఎన్. టి. యు, కాకతీయ విశ్వ విద్యాలయాల నుంచి గౌరవ డాక్టరేట్లు అందుకున్నారు. తిరుపతిలో ఆయనకు గజారోహణం, పౌర సన్మానం జరిగాయి. ఆయన స్వయంగా నేరెళ్ళ వేణుమాధవ్ సాంస్కృతిక సంస్థను స్థాపించి ప్రతి యేటా ఒక కళాకారుడిని సన్మానించారు. హనుమ కొండలో ఆయన పేరు మీదుగా డా. నేరెళ్ళ వేణుమాధవ్ కళా ప్రాంగణం నిర్మించారు. నేరెళ్ళ వేణుమాధవ్ వరంగల్ పట్టణం లోని మట్టెవాడలో శ్రీహరి, శ్రీలక్ష్మి దంపతులకు 1932 డిసెంబరు 28న జన్మించారు. పండితుడైన తండ్రి, వరంగల్ పట్టణానికి వచ్చే ప్రముఖులందరికీ తన ఇంట్లోనే ఆతిథ్యం ఇస్తుండగా, అలా వచ్చిన వారిలో చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి, వావిలికొలను సుబ్బారావు, వడ్డాది సుబ్బా రాయుడు, రాయప్రోలు సుబ్బారావు, శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి, కాశీ కృష్ణాచార్యులు, యర్రమిల్లి జగ్గన్న శాస్త్రి వంటి గొప్పవారి సాహితీ గోష్ఠుల ప్రభావం వేణుమాధవ్ మీద పడింది. సినిమాలంటే ఎంతో ఇష్టం. చిత్తూరు నాగయ్య నటించిన గృహలక్ష్మి, వందేమాతరం, దేవత, స్వర్గసీమ, పోతన, వేమన సినిమాలు చూసి, నాగయ్య కూడా ధ్వన్యనుకరణ చేయగలవారు కావడంతో ఆయన పై అభిమానంతో కేవలం స్వయం పరిశీలనతోనే ఆ రంగంలో ప్రవేశించారు. అలాగే వేమూరి గగ్గయ్య, మాధవపెద్ది వెంకట్రామయ్య నటించిన సినిమాలు చూసి, ఇంటికి రాగానే ఆ సినిమాల్లోని పాటలను, పద్యాలను యథాతథంగా అనుకరించి చూపేవారు. అలా మొదలయ్యింది అయన మిమిక్రీ ప్రస్థానం. 1950 లో మెట్రిక్యులేషన్, 1952 లో వరంగల్ ఆర్ట్స్ అండ్ సైన్సు కాలేజీలో చేరారు. నాటి ప్రిన్సిపాల్ బారు వెంకట రామనర్సు, ఇతర లెక్చరర్లు వారించినా వినకుండా, గుడ్ కాండక్టు కింద వేణుమాధవ్ కు ఆ రోజుల్లో అరవై రూపాయల స్కాలర్ షిప్ ( బర్సరీ ) మంజూరు చేశారు. ఆ డబ్బుతో పలు ఇంగ్లీషు సినిమాల్ని చూసి వాటిల్లోని ఆర్టిస్టుల గొంతులు, ముఖ్యమైన సన్నివేషాలు బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ నోట్స్ తో సహా వినిపిస్తే, రామనర్సు పరమానంద భరితులై "యూ విల్ బికం ఎ గ్రేట్ ఆర్టిస్ట్ ఇన్ ద వరల్డ్" అని, అయితే నీవు నా రెండవ కుమారుడవు అని మనసారా ఆశీర్వదించారు. ఆ దీవెనలే ఆయనను 'విశ్వ విఖ్యాత ధ్వన్యనుకరణ సామ్రాట్' గా ఎదిగేలా చేసాయి. 1953 లో ప్రభుత్వ పాఠశాల (జి సి ఎస్ స్కూలు హనుమకొండ) లో ఉపాధ్యాయులుగా ప్రవేశించి, ధర్మ సాగరం, హనుమకొండ లోని ప్రాక్టీసింగ్ స్కూలు, మట్వాడ ఉన్నత పాఠశాల, జనగామ, శంభునిపేట పాఠశాలల్లో పని చేశారు. అనంతర కాలంలో ప్రైవేటుగా బీ.ఏ. బీ. కాం పాసయ్యారు. తొలి ప్రదర్శన 1947 లో ఇచ్చారు. మలి ప్రదర్శన 1953 లో రాజమండ్రిలో జరిగిన థియేటర్స్ ఫెడరేషన్ కాన్ఫరెన్స్ లో బలరాజ సహానీ అధ్యక్షతన, గరికపాటి రాజారావు, దాడి గోవింద రాజులు, స్థానం నరసింహారావు, చాగంటి సన్యాసి రాజు తదితర ప్రముఖుల సమక్షంలో ఇచ్చారు. ఆయన ప్రదర్శనలు చూసిన పలువురు రాజకీయ ప్రముఖుల్లో దివంగత రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్, దివంగత ప్రధానులు ఇందిరా గాంధీ, పీవీ నరసింహారావు లాంటి ఎంతోమంది ఉన్నారు. ఆస్ట్రేలియా, ఫిజీ దీవులు –1965, సింగపూర్, మలేషియా – 1968, పశ్చిమ జర్మనీ, ఇంగ్లండ్, ఫ్రాన్స్, అమెరికా, కెనెడా, లెబనాన్ – 1971, ఐక్యరాజ్య సమితిలో ప్రదర్శన – 1971, సింగపూర్,మలేషియా – 1975, అమెరికా, కెనెడా – 1976, దక్షిణాఫ్రికా, మారిషస్, సీషెల్స్ – 1976, సింగపూర్, మలేషియా –1977, అమెరికా, కెనెడా – 1982, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ – 1987, మారిషస్ – 1990 తదితర దేశాలలో పర్యటించి ప్రదర్శనలు ఇచ్చారు. వేణుమాధవ్ గారు నిర్వహించిన పదవుల్లో ఎం.ఎల్.సీ (1972–78), ఎఫ్.డీ.సీ డైరెక్టర్ (1976–77), సంగీత నాటక అకాడమీ సభ్యుడు (1974–78), సౌత్ జోన్ కల్చరల్ కమిటీ, తంజావూరు సభ్యుడు, దూరదర్శన్ ప్రోగ్రాం అడ్వయిజరీ కమిటీ సభ్యుడు (1993–94), టెలికాం అడ్వయిజరీ కమిటీ సభ్యుడు (1993–96), రైల్వే జోనల్ యూజర్స్ కమిటీ సభ్యుడు (1993–96), ఎ.పి.లెజిస్లేటివ్ లైబ్రరీ కమిటీ సభ్యుడు (1972–75), రవీంద్ర భారతి కమిటీ సభ్యుడు (1974–78), ప్రభుత్వ అకాడమిక్ రివ్యూ కమిటీ సభ్యుడు (1975–76) తదితర పదవులు నిర్వహించారు. ధ్వన్యనుకరణ సామ్రాట్, మిమిక్రీ సామ్రాట్, చుపే రుస్తుం ధ్వన్యను కరణ చక్రవర్తి, కళా సరస్వతి, స్వర్ కే రాజా, ధ్వన్యను కరణ ప్రవీణ, ధ్వన్యను కరణ కళానిధి, మిమిక్రీ రత్న, విశ్వ విఖ్యాత ధ్వన్యను కరణ సార్వభౌమ, మున్నగు బిరుదులు వరించాయి. 1977 ఆంధ్రా విశ్వ విద్యాలయం నుండి కళా ప్రపూర్ణ బిరుదు, 1982 రాజాలక్ష్మి ఫౌండేషన్ అవార్డు, 1987 జవహర్ లాల్ నెహ్రూ టెక్నాలజీ విశ్వ విద్యాలయం, 1992 కాకతీయ విశ్వ విద్యాలయం నుండి గౌరవ డాక్టరేటు...1997 కనకాభిషేకం, 1998 ఎన్టీఆర్ ఆత్మ గౌరవ పురస్కారం, 2001 పద్మశ్రీ, 2005 తెలుగు విశ్వ విద్యాలయం నుండి సాంస్కృతిక రంగంలో విశిష్ట పురస్కారం, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ పురస్కారాలు – 2018లో భాగంగా జూన్ 2న తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా పురస్కారం అందజేయ బడింది.

తిరుపతి పట్టణంలో గజారోహణం, పౌర సన్మానం జరిగాయి. పద్మశ్రీ నేరెళ్ల వేణుమాధవ్ 2018, జూన్ 19వ తేదీ తమ 85వ యేట కన్నుమూశారు. హనుమకొండ పట్టణంలో నిర్మింపబడ్డ 'డా.నేరెళ్ళ వేణుమాధవ్ గారి కళాప్రాంగణం ' సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలకు చక్కని వేదికగా ఉపయోగ పడుతున్నది. నేరెళ్ళ వేణుమాధవ్ కల్చరల్ ట్రస్ట్' ను స్థాపించి ప్రతియేటా తన పుట్టిన రోజైన డిసెంబర్ 28న ప్రముఖ కళాకారులను పదివేల రూపాయల పురస్కారంతో సత్కరిస్తున్నారు. 2017లో నేరెళ్ల వేణుమాధవ్ పేరుతో పోస్టల్ శాఖ ప్రత్యేక కవర్‌ను విడుదల చేసింది. ఆయన పుట్టిన రోజైన డిసెంబర్ 28వ తేదీని తెలుగు రాష్ట్రాల్లో 'మిమిక్రీ డే'గా జరుపు కుంటారు

# గణిశాస్త్ర మేధావి బ్లేజ్ పాస్కల్

అన్ని వయసులవారూ నేడు వాడే చిన్ని యంత్రం కాలుక్యులేటరు. కూడికలు, తీసివేతలు, హెచ్చ వేతలు, భాగహారాలు ... ఒకటేమిటి, లెక్కల్లో వచ్చే ప్రతి అంశాన్నీ అతివేగంగా పరిష్కరించి తెరమీద చూపిస్తుంది. ఇది విద్యార్థులకు, వ్యాపార సంస్థలకు, అనేకులకు అనేక విధాలుగా ఉపయోగ పడుతుంది . దీన్ని కనుగొన్నశాస్త్రజ్ఞుడే బ్లెయిస్ పాస్కల్. పాస్కల్ (జూన్ 19, 1623 – ఆగష్టు 19, 1662) పాస్కల్ సూత్రం కనిపెట్టిన శాస్త్రవేత్త. ప్రఖ్యాతి గాంచిన గణిత శాస్త్రవేత్త, భౌతిక శాస్త్రజ్ఞుడు, ఆధ్యాత్మిక తత్వవేత్త. బ్లేజ్ పాస్కల్ జూన్ 19, 1623 న ఫ్రాన్స్ యొక్క దక్షిణ –మధ్య ప్రాంతంలో ఆవర్న్ ప్రాంతంలో క్లెర్మాంట్‌లో జన్మించాడు. ఈ ప్రాంతం ఉంది. చిన్న వయసులోనే మరణించిన గణిత మహా మేధావి. ఫ్రాన్స్‌కి చెందిన పాస్కల్ 7 యేండ్ల వయస్సు నుండే జామెట్రీ పట్ల విపరీతమైన ఆసక్తిని ప్రదర్శిస్తూ అందరినీ ఆశ్చర్య పరచే వాడట, 12 ఏళ్ళ వయస్సులోనే ఒక త్రిభుజం లోని మూడు కోణాల మొత్తం రెండు లంబకోణాల మొత్తానికి సమానంగా ఉంటుందనే సిద్ధాంతాన్ని ప్రవేశ పెట్టాడు. దీంతో ఈయన తండ్రి పాస్కల్ ను గణితం చదవడానికి ఎక్కువగా ఆసక్తి చూపాడు. అందరూ వేనోళ్ళ కొనియాడుతున్న "యూనివర్సల్ థీరం ఆఫ్ జామెట్రీ" పాస్కల్ రూపొందించినదే. పదహారేళ్ల వయసులో శంఖు పరిచ్ఛేదాల గురించి గొప్ప వ్యాసం రాసి మహామహా గణితవేత్తలే ముక్కున వేలు వేసుకునేట్టు చేశాడు పాస్కల్. ఆ కృషిలో బయట పడ్డదే పాస్కల్ సిద్ధాంతంగా తరువాత పేరు పొందింది. శంఖు పరిచ్ఛేదంలో అంతర్లిఖితమైన ఏదైనా షడ్భుజి యొక్క అభిముఖంగా ఉండే అంచులని కలుసుకునే వరకు పొడిగిస్తే, ఆ మూడు జతల అభిముఖ అంచులూ కలిసే మూడు ఖండన బిందువులూ ఒకే సరళరేఖలో ఉంటాయి. ఈ సిద్ధాంతం ప్రకారం... షడ్భుజి ఆరు భుజాలు (లేదా బాహువులు) గల బహుభుజి. ఆ భుజాలు సమానంగా ఉండనక్కర్లేదు. ఆరు భుజాలు ఉన్నాయి గనుక ఒకటోది, నాలుగోది అభిముఖంగా ఉంటాయి. అలాగే 2–5, 3–6 జతల భుజాలు కూడా అభిముఖంగా ఉంటాయి. ఈ అభిముఖంగా ఉండే భుజాల జతలని పొడిగిస్తే ఎక్కడో అక్కడ కలుస్తాయి. అలా వచ్చిన మూడు ఖండన బిందువులు ఒకే సరళ రేఖ మీద ఉంటాయని సిద్ధాంతం చెప్తుంది. పాస్కల్ సిద్ధాంతం 1639 లో ప్రచురించ బడింది, "ది కోనిక్స్ ఎస్సే". పాస్కల్ యొక్క ఆధ్యాత్మిక షడ్భుజి అని పిలుస్తారు. ఆయనకు 17 ఏళ్ళు వచ్చినప్పుడు ప్రముఖ గణిత శాస్త్రజ్ఞుడు డెస్ కార్టెస్ ఆయనలో ఒక గొప్ప మేధావిని చూసి ప్రశంసించాడు. అంతటి సమర్థుడు బ్లెయిసీ పాస్కల్. పాస్కల్ త్రిభుజం గురించి, దాని లక్షణాల గురించి 20ఏళ్ళ వయసుల ఓ పుస్తకం రాశాడు. పాస్కల్ జీవితమంతా ఫ్రాన్స్ లోనే గడిచింది. ఆయన తండ్రి అక్కౌంటెంట్ గా పని చేసేవాడు. రాత్రీ పగలూ లెక్కలు చేసేవాడు. తండ్రి పడుతున్న కష్టం చూచి పాస్కల్ లెక్కలు చేసే యంత్రాన్ని రూపొందించాడు. ఈ కాలిక్యులేటింగ్ మెషిన్ కూడికలు, తీసివేతలు, గుణింతాలు, భాగహారాలు వంటివి చేసిపెట్టేది. ఆ మెషీన్ పాస్కల్ తండ్రికి ఎంతగానో ఉపయోగపడేది. అయితే ఈ యంత్రాన్ని తయారు చేయటానికి ఎవరూ ముందుకు రాలేదు. కారణం దానికయ్యే ఖర్చు ఎక్కువ కావటమే. అయినప్పటికీ చాలా కాలం తరువాత 1892 విల్లియం బరగ్స్ అనే అమెరికన్ పాస్కల్ నమూనాను ఆధారంగా చేసుకునే ఓ కాలిక్యులేటింగ్ మెషీన్ రూపొందించాడు. పాస్కల్ సూత్రం తెలియని విద్యార్థి ఉండరు. ద్రవ పదార్థంలో ఏదైనా ఒక బిందువు వద్ద పీడనాన్ని ఉపయోగించడం జరిగితే ఆ పీడన ప్రభావం ఆ ద్రవ పదార్థం అన్ని పైపులకు సమానంగా విస్తరిస్తుంది. ఈ సూత్రాన్ని ఆధారంగా చేసుకుని సిరెంజ్ ని, హైడ్రాలిక్ ప్రెస్ ను, హైడ్రాలిక్ బ్రేక్ ను రూపొందించటం జరిగింది. పాస్కల్ ఒక త్రిభుజాన్ని కూడా నిర్మించాడు. దీన్ని పాస్కల్ త్రిభుజం అంటారు. ఈ త్రిభుజం సహాయంతో ప్రాబబిలిటీ సమస్యలను సునాయాసంగా చేయవచ్చు. 1643 లో చేసిన గణిత శాస్త్రవేత్త మరియు భౌతిక శాస్త్రవేత్త ఎవాంజెలిస్టా టోరిసెల్లి రూపొందించిన ప్రయోగాలను పునరావృతం చేశాడు.1646 నుండి పాస్కల్ శూన్యతను తనిఖీ చేసే ఎంపికలను అధ్యయనం చేయడానికి తనను తాను అంకితం చేసుకున్నాడు. 1653 లో పాస్కల్ వాతావరణ పీడనం గురించి ఒక గ్రంథాన్ని ప్రచురించాడు. హైడ్రో స్టాటిక్స్ అంశం చాలా వివరణాత్మక రీతిలో అభివృద్ధి చేయబడిన మొదటి గ్రంథంగా ఇది పరిగణించ బడుతుంది. పాస్కల్ శాస్త్రవేత్త మాత్రమే కాదు. తత్వవేత్త కూడా. రచయిత కూడ, మతపరమైన పుస్తకాలను ఎన్నింటినో రాసాడు. జామెట్రీ, ప్రాబబిలిటీ, హైడ్రోస్టాటిక్స్, ఎంటగ్రల్ కాలిక్యులస్ ౦ అంశాల మీద ఎన్నో విలువైన పరిశోధనలు చేశాడు. పాస్కల్ ప్రధాన రచనలు పాస్కల్ యొక్క సిద్ధాంతం, పాస్కలిన్, శూన్యత యొక్క ఉనికి లేదా వాతావరణ పీడనంపై ప్రయోగాలు. 1659 లో తీవ్ర అనారోగ్యం పాలై, పాస్కల్ 1662 లో కన్ను మూశాడు. మొదటి కాలిక్యులేటర్ నుండి మొదటి ప్రజా రవాణా సేవ వరకు ఆవిష్కరణలతో అతను చిన్న వయస్సు నుండే ప్రపంచాన్ని విప్లవాత్మకంగా మార్చాడు. ఆయన వెలువరించిన శాస్త్రీయ వాస్తవాలు మాత్రం ఎంతో మందికి మార్గ నిర్దేశం చేస్తున్నాయి.

# అనువంశిక రక్తరుగ్మత 'సికిల్ సెల్ అనీమియా'

తల్లితండ్రుల నుంచి సంక్రమించే జన్యులోప రుగ్మతగా "సికిల్ సెల్ రక్తహీనత" ప్రమాదకరంగా మారుతోంది. శరీర కణజాలానికి ప్రాణవాయువు, ఆక్సిజన్‌ను అందించే రక్తంలోని ఎర్ర రక్త కణాలతో కూడిన హీమోగ్లోబిన్ ఉపకరిస్తుంది. ఆక్సిజన్‌ను సరఫరా చేస్తున్న ఎర్ర రక్త కణాలు గుండ్రంగా, మృదువుగా, ఫ్లెగ్జిబుల్‌గా ఉంటూ రక్త నాళాల గుండా సులభంగా ప్రవహిస్తూ, మన ఆరోగ్యానికి పునాదులు వేస్తున్నాయి. సికిల్ సెల్ రుగ్మత బారిన పడిన వ్యక్తుల ఎర్ర రక్త కణాలు దృఢంగా, గట్టిగా, అంటుకునే గుణంతో, సి–ఆకారంలో కొడవలి లేదా సికిల్ ఆకారంలో ఉంటాయి. ఆ సికిల్ కణాలు రక్తనాళాల్లో సులభంగా ప్రవహించకుండా, త్వరగా చనిపోతూ ఉంటాయి. ఇలాంటి సికిల్ సెల్ రుగ్మత ఉన్న వారిలో దీర్ఘకాలిక రక్తహీనత, నొప్పులు, అవయవాలకు హాని, ఇతర తీవ్రమైన అనారోగ్యాలను కలిగిస్తుంది. దీనినే సికిల్ సెల్ రుగ్మతగా పిలవడం జరుగుతోంది. సికిల్ సెల్ రక్త రుగ్మత పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడం, ముందస్తు పరీక్షలతో గుర్తించడం, వ్యాధిగ్రస్తుల పట్ల జాగ్రత్తలు తీసుకోవడం, రోగుల కుటుంబాల్లో ఆత్మ విశ్వాసం పెంచడం లాంటి కార్యక్రమాలను నిర్వహించడానికి ఐరాస ఆమోదంతో ప్రతి ఏట 19 జూన్ రోజున "ప్రపంచ సికిల్ సెల్ అవగాహన దినం (వరల్డ్ సికిల్ సెల్ అవేర్‌నెస్ డే)" పాటించడం ఆనవాయితీగా మారింది. 2025 ప్రపంచ సికిల్ సెల్ అవగాహన దినం ఇతివృత్తంగా "స్వీయ అనుకూల వాదంతో పౌర సమాజాన్ని శక్తివంతం చేయడం" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు. భారత గిరిజన తెగల్లో అత్యధికంగా కనిపిస్తున్న సికిల్ సెల్ వ్యాధి ప్రమాదకరంగా మారుతోంది. 2011 వివరాల ప్రకారం 8.6 శాతం గిరిజన జనాభా లేదా 67.8 మిలియన్ల అభాగ్యులు సికిల్ సెల్ రుగ్మత బారిన పడ్డట్లు స్పష్టం అవుతున్నది. భారతదేశంలో యంపీ, ఛత్తీస్‌ఘడ్, ఝూర?ండ్, ఒడిసా, గుజరాత్, మహారాష్ట్ర లాంటి 17 రాష్ట్రాలు/యూటీల్లో అధికంగా కనిపిస్తున్న సికిల్ సెల్ వ్యాధిగ్రస్థులు కనిపిస్తున్నారు. వ్యాధి తీవ్రతను గుర్తించిన భారత ప్రభుత్వం "జాతీయ సికిల్ సెల్ రక్తహీనత నిర్మూలన మిషన్"ను తీసుకోని 2047 నాటికి ఈ వ్యాధిని నిర్మూలించడానికి పథక రచన చేసి అమలు పరుస్తున్నారు. ఈ మిషన్‌లో భాగంగా 2026 నాటికి 7 కోట్ల గిరిజనులకు నిర్ధారణ పరీక్షలు నిర్వహించడానికి కృషి జరుగుతోంది.జన్యువుల్లో మ్యుటేషన్ లేదా ఒకదానితో మరొకటి మార్పు చెందడం వల్ల హిమోగ్లోబిన్ ఉత్పత్తిలో లోపం జరు గుతుంది.తల్లితండ్రులు ఇద్దరిలోఇలాంటి జన్యు లోపాలు ఉన్నట్లు అయితే వారి సంతానానికి కూడా సికిల్ సెల్ రుగ్మత సంక్రమిస్తుంది.తల్లితండ్రుల్లో ఒక్కరికి మాత్రమే జన్యు లోపం ఉన్నట్టైతో పిల్లల్లో జన్యు లోపాలు కనిపించినప్పటికీ రోగ లక్షణాలు మాత్రం కనిపించకపోవచ్చని తెలుసుకోవాలి.

# నరమేధంపై గ్రేటా తెగువ

హిట్లర్, ముస్సోలినీలను మించి నరమేధం సాగిస్తున్న నెతన్యాహు సర్కారుపై, దానికి సమస్త వనరులను కట్టబెడుతున్న అమెరికా తీరుపై ప్రపంచవ్యాప్తంగా యువతలో ఆగ్రహం పెల్లుబుకుతోంది. పసిబిడ్డలు, మహిళలనుసైతం శత్రువులుగా చూస్తూ సహాయ కేంద్రాల వద్దకు ఆహారం కోసం వచ్చిన వారిని సైతం చంపుతున్న ఇజ్రాయిల్ దుర్మార్గం యువతను కదిలించివేస్తోంది. ప్రముఖ పర్యావరణ ఉద్యమకారిణి గ్రెటా థన్‌బర్గ్, పాలస్తీనా సంతతికి చెందిన యూరోపియన్ పార్లమెంట్‌లో ఫ్రెంచి సభ్యురాలు రిమాహసన్‌తోపాటు పన్నెండు మంది యువ కార్యకర్తల బఅందం ఈ నెల ఒకటిన సిసిలీ నుంచి బ్రిటీష్ నౌక మాడ్‌లీన్‌లో గాజాకు బయల్దేరింది. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఆ స్థాయికి మించి 55 వేలమందికిపైగా అమాయ కులను, అందులోనూ అత్యధికంగా మహిళలు, చిన్నారులను ఇజ్రాయిల్ పొట్టన పెట్టుకుంది. ఆసుపత్రులు, పాఠశాలలు, శరణార్థి కేంద్రాలతో సహా కీలకమైన మౌలిక వసతులన్నింటినీ నాశనం చేసింది.

ఇరవై లక్షలకుపైగా నివాసాలను భస్మీపటలం చేయడంతోపాటు డేరాల కింద తలదాచుకుంటున్న వారిని మాటిమాటికీ ఖాళీ చేయిస్తోంది. గాజాలోకి ఆహారం, ఇతర నిత్యావసరాలు తీసుకొచ్చే మానవతా సాయాన్ని సైతం అడ్డుకుంటోంది. పాలస్తీనా జాతి నిర్మూలన చేయాలన్న లక్ష్యంతో మానవతా విపత్తులోకి నెట్టిన ఇజ్రాయిల్ దుర్మార్గం మత, జాతి ఉన్మాదులకు మానవత్వం ఉండదనడానికి మరో రుజువు.ఈ ఘాతుకాలన్నీ అంతర్జాతీయంగా చర్చనీయాంశం చేయాలని, ఇజ్రాయిల్ సముద్ర దిగ్బంధనాన్ని ఛేదించి పిల్లల కోసం పాలు, ఆహార పదార్థాలు, అత్యవసర వైద్య పరికరాలు, ఇతర జీవనావసరాలను అందజేసేందుకు ఫ్రీడమ్ ఫ్లోటిల్లా ఆధ్వర్యాన బ్రిటీష్ నౌక మాడ్‌లీన్ బయల్దేరింది. గాజాకు 200 కిలోమీటర్ల దూరంలో అంతర్జాతీయ జలాల్లోనే ఈ నౌకను ఇజ్రాయిల్ నిర్బంధించడం, సహాయం అందకుండా చేయడం అమానుషం. నిర్బంధంలోకి తీసుకున్న గ్రెటా థన్‌బెర్గ్‌తో సహా నలుగురిని స్వదేశాలకు పంపివేసింది.

ఇజ్రాయిల్ నిర్బంధంలోనే ఉన్న మిగిలిన వారు స్వదేశాలకు వెళ్లడానికి నిరాకరించి, ఆందోళన చేస్తున్నారు. తనను, తన సహచరులను అంతర్జాతీయ జలాల్లో కిడ్నాప్ చేశారన్న గ్రేటా ఇజ్రాయిల్ అధికారులు తమ పట్ల వ్యవహరించిన అమానవీయమైన తీరు పాలస్తీనియన్ల వేదనతో పోలిస్తే లెక్కలోకి రాదన్నారు. దిగ్బంధనాన్ని ఛేదించడం దేశాల చట్టపరమైన బాధ్యత, మనందరి నైతిక బాధ్యత అన్న ఐక్యరాజ్య సమితి ప్రత్యేక దూత ఫ్రాన్సెసా అల్బనీస్ మాటలను లెక్కచేయని ఇజ్రాయిల్, అమెరికాల తీరు దుర్మార్గం.

ఈ ప్రతిఘటన ద్వారా ఇజ్రాయిల్ నరమేధాన్ని మరోసారి అంతర్జాతీయ సమాజం ముందుంచిన గ్రెటా థన్‌బర్గ్ బృందం కృషి అభినందనీయం. ఇంతటి రాక్షసకాండ సాగిస్తున్న ఇజ్రాయిల్‌కు నేటికీ అమెరికా వంత పాడుతూనే ఉంది. గ్రెటాకు కాస్త కోపం ఎక్కువనుకుంటా, ముందుగా ఆమె కోపాన్ని తగ్గించుకునే క్లాసులకు వెళ్లాలంటూ ట్రంప్ ఉచిత సలహా ఇచ్చారు. 'ఎముకలు క్రుళ్లిన, వయస్సు మళ్లిన సోమరులారా చావండి! నెత్తురుమండే శక్తులు నిండే సైనికులారా రారండి' అన్న శ్రీశ్రీ 'మరో ప్రపంచం' పిలుపు యువతకు అభ్యుదయ మార్గానికి దిశానిర్దేశం చేస్తూనే ఉంటుంది. అందువల్ల అటువంటి చచ్చు సలహాలు ఉద్యమకారుల స్ఫూర్తిని ఏమాత్రం ప్రభావితం చేయవు. ఇజ్రాయిల్ దుర్మార్గాలపై ఇటీవల అమెరికా గడ్డ మీద గర్జించిన యువ విజ్ఞాన వేత్త మేఘా వేమూరిని గుర్తు చేసుకోవడం అవసరం. 'మేము గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకుని మా జీవితంలో ముందుకు సాగడానికి సిద్ధమవుతుంటే, గాజాలో విశ్వవిద్యాలయాలే లేకుండా పోయాయి' అంటూ తన భవిష్యత్‌ను సైతం పణంగా పెట్టి ప్రశ్నించిన ఆమె తీరు యువతకు స్ఫూర్తిదాయకం

. పాలస్తీనాకు అనుకూలంగా మాట్లాడటమే నేరమన్నట్టు ప్రతిష్టాత్మక హార్వర్డ్ సహా పలు యూనివర్సిటీలకు నిధులను నిలిపివేస్తున్న, విద్యార్థులను విచక్షణా రహితంగా అరెస్టులు చేస్తూ, బేడీలు వేసి పంపిస్తున్న మితవాద ట్రంప్ పాలనలో భారత సంతతికి చెందిన మేఘా చూపినపాటి తెగువ చూపలేని మోడీ సర్కారు తీరు సిగ్గుచేటు. మనదేశంలో పెరుగుతున్న ఉన్మాదాన్ని ఆదిలోనే అడ్డుకోవడం ఎంత అత్యవసరమో ఇజ్రాయిల్ పరిణామాలు హెచ్చ రిస్తున్నాయి. దురాక్రమణదారైన ఇజ్రాయిల్ పట్ల సందిగ్ధ, బుజ్జగింపు ధోరణిని ఇప్పటికైనా కేంద్రం విడనాడాలి.

అమాయకుల ఊచకోతను, యుద్ధ నేరాలను ఖండించాలి. సైనిక, భద్రతా సహకారాన్ని నిలిపివేయాలి.

శతాబ్దానికిపైగా పాలస్తీనాకు అండగా నిలిచిన మనదేశ చారిత్రక వైఖరిని కొనసాగించాలి. కేంద్రంపై ఒత్తిడిని

# స్థానిక సంస్థల ఎన్నికలు:బీసీ రిజర్వేషన్ల సంక్లిష్టం

తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు మరోసారి సమీపిస్తున్న వేళ, బీసీ రిజర్వేషన్ల అంశం రాజకీయ, న్యాయ, సామాజిక వేదికలన్నింటినీ కలకలం రేపుతోంది. ముఖ్యంగా 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన "బీసీలకు 42% రిజర్వేషన్" హామీ, ఇప్పుడు కార్యరూపం దాల్చే దశకు వచ్చినపుడు అనేక ప్రశ్నలు, సందేహాలు, అడ్డంకుల మధ్య దూసుకు పోతోంది. స్థానిక సంస్థల ఎన్నికల సమీపంలో బీసీ రిజర్వేషన్ల అంశం మరోసారి సమగ్ర చర్చకు దారి తీసింది. తెలంగాణలో ఇటీవల ప్రభుత్వంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలో బీసీలకు స్థానిక సంస్థల స్థాయిలో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని స్పష్టంగా ప్రకటించింది. ఈ హామీ సామాజిక న్యాయ పరిరక్షణలో కొత్త ఒరవడి తీసుకు రాగలదా? లేక మరొకసారి రాజకీయ వాగ్దానంగా మిగిలి పోతుందా? అన్న ప్రశ్నలు ప్రజాస్వామ్య పరిరక్షక వర్గాలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. భారత రాజ్యాంగం 73వ, 74వ సవరణల ద్వారా దేశంలో ప్రజాపాలన వికేంద్రీకరణ దిశగా పదునెక్కింది. గ్రామ పంచాయతీ నుండి మహానగర పాలక సంస్థల వరకు ఎన్నికల ద్వారా ఏర్పడే స్థానిక సంస్థలకు సముచితంగా ప్రజాప్రతినిధులను ఎంపిక చేసుకోవడంలో సామాజిక న్యాయం కీలకంగా మారింది. ఈ నేపథ్యంలో వెనుకబడిన వర్గాలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళలకు రిజర్వేషన్లు కల్పించి రాజకీయ ప్రాతినిధ్యాన్ని గట్టి చేయాలనే ఆవశ్యకత రాజ్యాంగమే గుర్తించింది. అయితే ఈ రిజర్వేషన్ల అమలులో అనేక అనిష్టపరిణామాలు, న్యాయ సవాళ్లు, రాజకీయ లబ్ధిపరచుకునే ప్రయత్నాలు దర్శనమిస్తున్నాయి. ఇందులో ముఖ్యంగా బీసీ రిజర్వేషన్ల అంశం అత్యంత సంక్లిష్టంగా రూపాంతరం చెందింది. రాష్ట్రానికి రాష్ట్రానికి బీసీ వర్గీకరణలో భిన్నత ఉంది. బీసీలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎటువంటి స్థితిలో ఉన్నారన్నదానిపై సమగ్ర అధ్యయనం చేయకుండానే వాటికి కోటాలను ఖరారు చేయడం ప్రజాస్వామ్యానికి ముప్పుగా మారుతోంది. సుప్రీంకోర్టు ఇచ్చిన అనేక తీర్పుల్లో బీసీలకు రిజర్వేషన్ అమలులో మూడు ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చింది. ఒకటి – శాస్త్రీయంగా సేకరించిన డేటా ఆధారంగా బీసీల వెనుకబడిన స్థితిని నిర్ధారించాలి. రెండు –రిజర్వేషన్ల ప్రభావం ప్రజాస్వామ్య సమతుల్యంపై ఎలా ఉంటుందో పరిశీలించాలి. మూడవది – మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించకూడదు.

ఈ నిబంధనల మధ్య కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 42 శాతం బీసీ రిజర్వేషన్ హామీ రాజ్యాంగ బద్ధతకు అనుగుణమా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో బీసీల సంఖ్య సుమారు 50 శాతం వరకు ఉన్నదని కొన్ని సర్వేలు సూచించినా, రాష్ట్ర స్థాయిలో శాస్త్రీయంగా ధృవీకరించిన డేటా ఇప్పటికీ అందుబాటులో లేదు. 2010లో సుప్రీంకోర్టు మహారాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంలో ఇచ్చిన తీర్పులో, లెక్కించ తగిన డాటా లేకుండా రిజర్వేషన్లు ఇవ్వడం సబబు కాదని స్పష్టం చేసింది.

ఈ తీర్పు ఆధారంగా ఇటీవలే మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో బీసీ రిజర్వేషన్లపై ఎన్నికల ప్రక్రియ నిలిపివేయబడ్డ సందర్భాలు ఉన్నాయి. అదే బాటలో 2022లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు బీసీ రిజర్వేషన్ల గడిచిన అనుసరణలు సైతం వ్యతిరేకంగా తీర్పు ఇచ్చింది. ఈ పరిణామాల నేపథ్యంలో తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం బీసీ రిజర్వేషన్ల అమలుకు ముందు ఆయా న్యాయ మార్గదర్శకాలను గౌరవించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇటు బీసీ వర్గాలు మాత్రం 42 శాతం హామీ అమలుపై స్పష్టత కోరుతున్నాయి. దశాబ్దాలుగా స్థానిక సంస్థల రాజకీయాల్లో బీసీ వర్గాల అధికార ప్రాతినిధ్యం పెరిగినప్పటికీ, వాటిలోనూ కొద్ది వర్గాలకే పదేపదే అవకాశాలు లభిస్తున్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి. బీసీల్లోని వివిధ ఉపవర్గాలకు న్యాయం జరగాలంటే, రిజర్వేషన్లలో శ్రేణీకరణ అవసరమని పలువురు నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం నియమించిన రోహిణీ కమిషన్ నివేదిక ప్రకారం, బీసీల్లో 15 శాతం వర్గాలే దాదాపు 80 శాతం రిజర్వేషన్‌ను వినియోగిస్తున్నాయని తేలింది.

ఈ వాస్తవాల నేపథ్యంలో బీసీ రిజర్వేషన్ పెంపునే కాకుండా, ఆ రిజర్వేషన్ పంపిణీ పద్ధతి పట్ల కూడా స్పష్టత అవసరం. ఇంకా మరో సమస్య ఏమిటంటే, బీసీ రిజర్వేషన్ల అమలును స్థానిక రాజకీయ నాయకులు, పార్టీలు నియంత్రిస్తున్న విధానం. వాస్తవంగా సామాజికంగా వెనుకబడిన వారికి అవకాశం రావాల్సిన చోట, పార్టీ అధినేతల బంధువులు, అనుచరులు, అదే వర్గానికి చెందినవారే పదే పదే పదవులను అధిష్ఠించడ మవుతోంది. దీని వలన అసలు రిజర్వేషన్ ఉద్దేశానికి విరుద్ధంగా సామాజిక సమానత్వం దెబ్బతింటోంది. ఇక కాంగ్రెస్ హామీపై వస్తున్న విమర్శల్లో ఒకటి – ఎన్నికల ముందు ఇచ్చిన హామీకి స్పష్టమైన అమలుక్రమాలు లేకపోవడమే. బీసీ రిజర్వేషన్ 42 శాతం చట్టంగా అమలవ్వాలంటే అసెంబ్లీలో చట్టం చేయడమే కాకుండా, ప్రస్తుతం ఉన్న మహిళా, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లతో కలిపి మొత్తంగా 50 శాతం మించకుండా ఉండాలన్న రాజ్యాంగ పరిమితిని ఎట్టి పరిస్థితుల్లోనూ మించలేము. అటువంటి పరిస్థితిలో బీసీలకు అదనంగా రిజర్వేషన్ ఇవ్వాలంటే, కేంద్ర రాజ్యాంగ సవరణల సహకారం కూడా అవసరమవుతుంది. బీసీ రిజర్వేషన్ల అంశం కేవలం సంఖ్యల గణితం కాదనే విషయాన్ని గుర్తించాలి. ఇది శతాబ్దాల నాటి అసమానతల పరిహార యత్నం. ప్రజాస్వామ్యంలో ప్రతినిధిత్వం కేవలం ఓట్ల మీద ఆధారపడి ఉండకూడదు. సామాజికంగా వెనుకబడిన వర్గాలకి రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలన్నదే రిజర్వేషన్ లక్ష్యం. కానీ ఆ లక్ష్యాన్ని ఆచరణలో అమలు చేయాలంటే, సమగ్ర డేటా, శాస్త్రీయ పద్ధతులు, పారదర్శక విధానాలు, రాజకీయ సంకల్పం అవసరం. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ బీసీ వర్గాలకు ఆశను కలిగించినా, దానిని కార్యరూపం దాల్చించాలంటే రాజకీయ ప్రకటనలకన్నా పైగా చట్టబద్ధ ప్రణాళిక అవసరం. ఒకవేళ ప్రభుత్వం శాస్త్రీయంగా బీసీ జనాభా గణాంకాలను సేకరించి, హైకోర్టు – సుప్రీంకోర్టుల మార్గదర్శకాలను అనుసరిస్తూ, అవసరమైతే కేంద్రంతో రాజ్యాంగ సవరణపై చర్చ జరిపితేనే ఈ సమస్యకు సుస్థిర పరిష్కారం కనుగొన గలుగుతుంది.

లేదంటే ప్రతి ఎన్నికల నాటికి ఇదే సమస్య రాజకీయం చెంది, బీసీల సామూహిక ఆకాంక్షలు ఒక రాజకీయ నినాదంగా మిగిలిపోతాయన్నది దురదృష్టకరం. బీసీ రిజర్వేషన్ల అంశం పై దృష్టి సారించే సమయం ఇది. ఇది కేవలం ఓట్ల కోసం తాత్కాలిక పథకంగా కాక, శాశ్వత సామాజిక న్యాయ సాధనగా మారేందుకు పాలకుల చిత్తశుద్ధి నిర్దేశకంగా నిలవాలి.

# తమిళం కన్నా తెలుగు బేరాలు బాగున్నాయి



ఇంకో మూడు రోజుల్లో విడుదల కాబోతున్న కుబేర మీద అంచనాలు ఎగబాకుతున్నాయి. ఇటీవలే జరిగిన ప్రీ రిలీజ్ ఈవెంట్ లో రిలీజ్ చేసిన ట్రైలర్ సినిమా హైప్ విషయంలో బాగా ఉపయోగపడుతోంది. దర్శకుడు శేఖర్ కమ్ముల టిపికల్ స్టైల్ కనిపించినప్పటికీ ఆయన ఫాలో అయ్యే సాఫ్ట్ ఫార్ములా కాకుండా సీరియస్ జానర్ వైపు షిఫ్ట్ కావడం ఆసక్తి రేపుతోంది. అడ్వాన్స్ బుకింగ్స్ అప్పుడే ట్రెండింగ్ లోకి వచ్చేశాయి. బుక్ మై షో కదలికలు గమనిస్తే తమిళ వెర్షన్ కన్నా తెలుగు అమ్మకాలే వేగంగా ఉండటం గమనార్హం. హైదరాబాద్ ప్రముఖ మల్టీప్లెక్సుల్లో మొదటి రోజు షోలు దాదాపు ఫుల్ అవుతున్న వైనం కనిపిస్తోంది. దీనికి కారణాలు లేకపోలేదు. తమిళ ఆడియన్స్ కుబేరని తెలుగు సినిమాగానే చూస్తున్నారు. బై లింగ్వల్ అయినప్పటికీ శేఖర్ కమ్ముల, నాగార్జున, దేవిశ్రీ ప్రసాద్, రష్మిక మందన్న లాంటి పేర్లు ఆ ఫ్లేవర్ తీసుకొస్తున్నాయి. పైగా ట్రైలర్ సైతం మన నేటివిటీలోనే ఉందని వాళ్ళ ఫీలింగ్. గతంలో సార్ సైతం ఇదే తరహా స్పందన తెచ్చుకోవడం గుర్తు చేసుకోవచ్చు. ఇక్కడ బ్లాక్ బస్టర్ అయితే అక్కడ జస్ట్ హిట్ అనిపించుకుంది. కుబేర సైతం అదే కోవలోకి చేరొచ్చని ట్రేడ్ అంచనా.

రెండు మూడు వారాలుగా విపరీతమైన డ్రైతో ఉన్న టాలీవుడ్ బాక్సాఫీస్ కు ఊపిరి పోసే బాధ్యత ఇప్పుడు కుబేర మీదే ఉంది. కుబేరకు తమిళం కన్నా తెలుగులోనే బేరాలు బాగుండటం మంచి విషయమే. టాక్ కనక బాగా వస్తే కనీసం రెండు మూడు వారాలు స్ట్రాంగ్ గా నిలిచేందుకు అవకాశం దొరుకుతుంది. జూన్ 27 కన్నప్ప, జూలై 4 తమ్ముడు ఉన్నప్పటికీ కుబేర కనక యునానిమస్ అనిపించుకుంటే కాంపిటీషన్

# నవ వధువులు చనిపోయే 'విరాటపాలెం'



'రెక్కీ' లాంటి సీట్ ఎడ్జ్ థ్రిల్లింగ్ వెబ్ సిరీస్ తరువాత 'విరాటపాలెం : పీసీ మీనా రిపోర్టింగ్' అనే ఓ ఉత్కంఠ రేపే వెబ్ సిరీస్‌తో మేకర్లు రాబోతోన్నారు. కృష్ణ పోలూరు దర్శకత్వం వహించిన ఈ వెబ్ సిరీస్ సూపర్ నేచురల్ థ్రిల్లర్‌గా అలరించనుంది. అభిజ్ఞా వూతలూరు, చరణ్ లక్కరాజు నటించిన ఈ సిరీస్ ఈనెల 27న జీ5లో మాత్రమే ప్రీమియర్ కానుంది. 1980ల నాటి మారుమూల, భయానక గ్రామమైన విరాటపాలెం చుట్టూ ఈ కథ తిరుగుతుంది. ఆ ఊరికి ఉన్న శాపం, ప్రతి వధువు తన పెళ్లి రోజున మరణించడం, దీంతో దశాబ్ద కాలంగా ఏ వివాహం జరగకపోవడం వంటి అంశాలతో కథ ముందుకు సాగుతుంది. అలా చివరకు పెళ్లిళ్లు అనేవి జరగకుండా గ్రామం భయంతో స్తంభించిపోతుంది. ఒక పోలీసు కానిస్టేబుల్ ఆ గ్రామానికి రావడం, అక్కడి శాపం గురించి తెలుసు కోవడం, ఆ రహస్యాన్ని ఛేదించడం అనే ఉత్కంఠ భరితమైన కథనంతో అందరినీ ఆకట్టుకునేలా ఈ సిరీస్ ఉండబోతోంది. జీ5 తెలుగు బిజినెస్ హెడ్ %-% అనురాధ గూడూర్ మాట్లాడుతూ, 'జీ5లో సాధారణ ప్రజలను ప్రతిబింబించే, వారికి కనెక్ట్ అయ్యే కథల్ని అందించాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నాం. ఈ సిరీస్ కూడా ఉత్కంఠను కలిగిస్తూనే సామాజిక సందేశాన్ని కూడా అందిస్తుంది. భయం అనేది సమాజాన్ని ఎలా నియంత్రించగలదో, ధైర్యం అనేది దశాబ్దాల నిశ్శబ్దాన్ని ఎలా భంగపరచగలదో ఈ సిరీస్ చూపిస్తుంది' అని అన్నారు. ''రెక్కీ' తర్వాత, మరోసారి జీ5తో కలిసి పనిచేయడం చాలా ఆనందంగా ఉంది. ఈ సిరీస్‌లో ఓ ఇంట్రెస్టింగ్ పాయింట్ ఉంటుంది. ప్రతి వధువు తన పెళ్లి రోజున మరణిస్తుంది. ఆ నమ్మకం భయంగా, భయం నిశ్శబ్దంగా మారిపోతుంది.

# సీక్వెల్స్ మంత్రం వద్దంటున్న ప్రభాస్



ఇప్పుడంతా సీక్వెల్స్ ట్రెండ్. ఒకప్పుడు టాలీవుడ్ లో పార్ట్ 2 అనే మాట ఉండేది కాదు. మనీతో రామ్ గోపాల్ వర్మ లాంటి నిర్మాతలు ఒకటి రెండు ప్రయత్నాలు చేసినా ఫలితాలు దక్కలేదు. కానీ బాహుబలి మొత్తం మార్చేసింది. కేవలం తెలుగులోనే కాదు అన్ని భాషల్లోనూ కొనసాగింపు జ్వరం అంటించింది. ఇది ఏ స్థాయిలో ఉందంటే రెండో భాగం కోసం సంవత్సరాల తరబడి ఖర్చు పెడుతున్న స్టార్ హీరోలు చాలా ఉన్నారు. కెజిఎఫ్ కోసం యష్ తీసుకున్న గ్యాప్ చిన్నది కాదు. పుష్ప సిరీస్ కోసం అల్లు అర్జున్ వెచ్చించిన సమయం అక్షరాలా అయిదు సంవత్సరాలు. అఫ్కోర్స్ దానికి తగ్గ గొప్ప ఫలితం అందుకోవడం వేరే విషయం. కానీ ప్రభాస్ మాత్రం సీక్వెల్స్ వెంటపడను అంటున్నాడు. ఇప్పటిదాకా సలార్ 2 శౌర్యంగపర్వం ఎప్పుడు మొదలవుతుందో ఎవరికీ తెలియదు. ఇతర నటీనటులు ఎగ్రిమెంట్ తో ఉన్నారు కానీ డార్లింగ్ మాత్రం కొత్త కథల వైపు మొగ్గు చూపుతున్నాడు. కల్కి 2 కోసం దర్శకుడు నాగ్ అశ్విన్ సిద్ధంగా ఉన్నా ఎప్పుడు స్టార్ట్ చేయాలనేది ప్రభాస్ డేట్స్ మీద ఆధారపడి ఉంటుంది. ది రాజా సాబ్ సింగల్ పార్ట్ ఉంటుందని, బలవంతంగా సీక్వెల్ రుద్దమని దర్శకుడు మారుతీ డైరెక్ట్ గా సంకేతం ఇచ్చాడు. ఫౌజీకి కంటిన్యూయేషన్ ఉండదు ప్రశాంత్ వర్మ తీయబోయే ప్యాన్ ఇండియా మూవీ, సందీప్ వంగా స్పిరిట్ సైతం సింగల్ పార్టని ఇన్ సైడ్ టాక్. ఏది ఏమైనా ప్రభాస్ తీసుకుంటున్న నిర్ణయాల వల్ల అభిమానులు, ప్రేక్షకులు ఫ్రెష్ సబ్జెక్టుల్లో తమ హీరోని చూసుకుంటున్నారు. ఒకవేళ ఇవేవి కాకుండా కేవలం సలార్ 2నే స్టార్ట్ అయ్యుంటే ప్రశాంత్ నీల్ వర్కింగ్ స్టైల్ కి మిగిలినవి అసలు స్టార్ట్ అయ్యేవి కాదు.

# మళ్ళీ సైలెంట్ అయ్యిందేంటి



మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి తర్వాత గ్యాప్ తీసుకున్న అనుష్క కొత్త సినిమా ఘాటీ ఏప్రిల్ 18 నుంచి తప్పుకున్నాక కొత్త డేట్ జూలై 11 తీసుకుంది. ఇప్పుడు చేతిలో నెల రోజులు లేకపోయినా ఇంకా ప్రమోషన్లు మొదలు కాకపోవడం ఫ్యాన్స్ లో అనుమానాలు రేపుతోంది. అదే తేదీకి సుహాస్ ఓ భామ అయ్యో రామాని రిలీజ్ చేయడం చూస్తుంటే స్వీటీ మూవీ మళ్ళీ పోస్ట్ పోన్ అయిందేమోనని డౌట్ రావడం సహజం. యువి క్రియేషన్స్ బ్యానర్ పై క్రిష్ దర్శకత్వంలో రూపొందిన ఈ లేడీ గ్యాంగ్ స్టర్ డ్రామాలో అనుష్క గంజాయి డాన్ గా నటిస్తోంది. ఇప్పటిదాకా ఇంట్రో టీజర్ తప్ప ఎలాంటి ప్రమోషన్ కంటెంట్ వదల్లేదు. ఈ మౌనం వెనుక కొన్ని పరిణామాలు కనిపిస్తున్నాయి. ఘాటీ పోస్ట్ ప్రొడక్షన్ ఇంకా అవ్వలేదు. పనులైతే జరుగుతున్నాయి. క్రిష్ బయటికి కనిపించకపోవడానికి కారణం ఇదే. అయితే హరిహర వీరమల్లు రిలీజ్ డేట్ ఇంకా ఖరారు కాని నేపథ్యంలో రెండింటి మధ్య కనీసం రెండు వారాల గ్యాప్ ఉండాలనేది ఘాటీ నిర్మాతల ఆలోచన. ఇంకోవైపు ఈ రెండు ప్యాన్ ఇండియా సినిమాల ఓటిటి హక్కులు అమెజాన్ ప్రైమ్ కొనుక్కుంది. థియేటర్ రిలీజ్ డేట్లు ఫైనల్ చేసే విషయంలో ప్రైమ్ షెడ్యూల్స్ కీలకం కాబోతున్నాయి. ఆ సంస్థ ప్రతినిధులతో మాట్లాడే ఘాటీ జూన్ 11 తీసుకుందనేది అంతర్గత వర్గాల సమాచారం. ఒకవేళ అదే డేట్ కి కట్టుబడితే మాత్రం వీలైనంత త్వరగా పబ్లిసిటీ మొదలుపెట్టాలి. అనుష్క ఈసారైనా బయటికి వస్తుందో లేదోననేది ఆసక్తికరంగా మారింది. యువి నిర్మిస్తున్న విశ్వంభర సైతం ఇదే తరహా డోలాయమానంలో చిక్కుకున్న సంగతి తెలిసిందే.

# 'భూ అంటూ భూతం వస్తే.. – ఆగకే అమ్మాడీ'



శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ నిర్మాణంలో నితిన్ హీరోగా శ్రీరామ్ వేణు దర్శకత్వంలో రూపొందుతున్న మూవీ 'తమ్ముడు'. దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో లయ, వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ కీలక పాత్రలు పోషిస్తున్నారు. జూలై 4న ఈ సినిమా వరల్డ్ వైడ్‌గా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. మంగళవారం ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ 'భూ అంటూ భూతం..'ను రిలీజ్ చేశారు. మేనకోడలు బేబి దిత్యకు మేనమామ నితిన్ ధైర్యం చెప్పే సందర్భంలో ఈ పాటను చిత్రీకరించారు. 'భూ అంటూ భూతం..' పాటను అజనీష్ లోకనాథ్ బ్యూటీఫుల్‌గా కంపోజ్ చేయగా, అనురాగ్ కులకర్ణి, అక్షిత పోల ఆకట్టుకునేలా పాడారు. సింహాచలం మన్నేలా లిరిక్స్ రాశారు. 'భూ అంటూ భూతం వస్తే ఆగకే అమ్మాడీ, ఛూ మంత్రం వేసి దాంతో బొమ్మలాట లాడాలి. భూ అంటూ భూతం వస్తే ఆగకే అమ్మాడీ, ఛూ మంత్రం వేసి దాంతో బొమ్మలాట లాడాలి..పుట్టగానే నేరుగా నువు పరుగెత్తలే, పట్టుకుంటూ పడుతూ నడకేనేర్చావే, భయపడి అడుగు ఆపకే..' అంటూ సాగుతుందీ పాట అని చిత్ర యూనిట్ తెలిపింది. నితిన్, లయ, వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ, స్వసిక విజయన్, బేబీ శ్రీరామ్ దిత్య తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ – కేవీ గుహన్, ఎడిటింగ్ – ప్రవీణ్ పూడి, మ్యూజిక్ – అజనీష్ లోకనాథ్, నిర్మాత – దిల్ రాజు, శిరీష్, రచన –దర్శకత్వం – శ్రీరామ్ వేణు.

# పైరసీ బారిన పడితే ఇన్సూరెన్స్ వస్తుందా



ఇటీవలి కాలంలో స్టార్ హీరోల సినిమాలకు పైరసీ పెద్ద బెడదగా మారిపోయింది. రిలీజ్ రోజు మధ్యాన్నానికే మంచి హెచ్డి ప్రింట్లు రావడం పట్ల నిర్మాతలు పడుతున్న ఆందోళన అంతా ఇంతా కాదు. దీనికో పరిష్కారం కనుక్కునే దిశగా కొత్త మార్గాలు వెతుకుతున్నారు. వాటిలో ఇన్సూరెన్స్ చేయించడం గురించి బాలీవుడ్ లో చర్చలు జరుగుతున్నాయి. ముంబై మీడియా ప్రకారం సల్మాన్ ఖాన్ సికందర్ నిర్మాణ సంస్థ తమ చిత్రం పైరసీ బారిన పడటం వల్ల జరిగిన నష్టానికి గాను తొంభై కోట్ల క్లెయిమ్ ని కోరే ఆలోచనలో ఉందట. ముందు రోజు రాత్రే ఈ మూవీ తాలూకు ఒరిజినల్ వెర్షన్లు ఆన్ లైన్ లో ప్రత్యక్షమైన సంగతి తెలిసిందే. ఇది మాటల్లో చెప్పుకున్నంత సులభం కాదు. ఎందుకంటే పైరసీ ప్రమాదాన్ని ముందే గుర్తించి ఇన్సూరెన్స్ చేయించినా సదరు కంపెనీలు గుడ్డిగా సొమ్ములు చెల్లించవు. లోతైన పరిశీలన చేస్తాయి. నిర్మాత స్వంత ప్రాపర్టీ అయిన సినిమా అసలు బయటికి ఎలా వచ్చిందనే దాని మీద విచారణ కోరతారు. పోలీసుల ఇన్వెస్టిగేషన్ కు సంబంధించిన రిపోర్టులు సమర్పించాల్సి ఉంటుంది. ప్రొడక్షన్ కాస్ట్, సినిమా మీదున్న అంచనాలు, బిజినెస్ తాలూకు ఆధారాలు, బుక్ మై షో ట్రెండింగ్ గట్రా వ్యవహారాలు ఇలా రకరకాల ఆడిట్లను చేయించి ప్రొడ్యూసర్ తప్పేమి లేకుండానే డ్యామేజ్ జరిగిందని తేలితే అప్పుడు క్లెయిమ్ ఇస్తారు. ప్రస్తుతానికి సికందర్ బృందం ఇంకా ఇన్సూరెన్స్ కోసం అప్పీల్ చేయలేదు కానీ ప్రతిపాదన మాత్రం సీరియస్ గా ఉందట. ఏదైనా విపత్తు జరిగినప్పుడు కాంపెన్సేషన్ డిమాండ్ చేయడం సబబే కానీ ఇలా ఇంటి దొంగలు ఎక్కువగా ఉండే పైరసీ లాంటి సమస్యలకు పరిష్కారం అంత సులభంగా ఉండదు.

# పూరి సినిమాలో సంయుక్త

విజయ్ సేతుపతితో డైరెక్టర్ పూరి జగన్నాథ్ ఓ పాన్–ఇండియా ప్రాజెక్ట్ చిత్రీకరణను ప్రారంభించనున్నారు. హై–ఆక్టేన్ కథలకు పాపులరైన పూరి, తన సిగేచర్ మాస్, కమర్షియల్ స్టయిల్‌ని విజయ్ సేతుపతి మాగెటిక్ స్క్రీన్ ప్రెజెన్స్‌తో బ్లెండ్ చేసి ఒక యూనిక్ సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఇవ్వబోతున్నారు. ఈ చిత్రాన్ని పూరి కనెక్ట్స్ బ్యానర్‌పై పూరి జగన్నాథ్, చార్మీ కౌర్ నిర్మిస్తారు. అన్ని ప్రీ–ప్రొడక్షన్ ఫార్మాలిటీలు పూర్తయ్యాయి. ఈ సినిమాలోని కీలక నటీనటులను నిర్మాతలు ఒకరి తర్వాత ఒకరిని అనౌన్స్ చేస్తున్నారు. టబు, దునియా విజరు కుమార్ ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పుడు, సంయుక్త ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్నట్లు మేకర్స్ అనౌన్స్ చేశారు. ఇది రెగ్యులర్ హీరోయిన్ పాత్ర కాదు. సంయుక్త పాత్ర కథనంలో కీలకంగా ఉంటుంది. ఎమోషనల్ డెప్త్, పెర్ఫార్మెన్స్‌కి స్కోప్ ఉండే పాత్రలో కనిపించబోతున్నారు. కథ, ఆమె పాత్రతో సంయుక్త చాలా థ్రిల్ అయ్యింది. చిత్రీకరణ స్టార్ట్ చేయడానికి ఆమె ఆసక్తిగా ఉంది అని మేకర్స్ తెలిపారు. 'వైవిధ్య కథతో తెరకెక్కబోయే ఈ సినిమాలో విజరుసేతుపతి, సంయుక్త పాత్రలు ప్రేక్షకుల్ని సర్‌ప్రైజ్ చేస్తాయి' అని పూరి జగన్నాథ్ చెప్పారు. ఫస్ట్ షెడ్యూల్ కోసం లొకేషన్లను ఖరారు చేయడానికి టీం ఇటీవల హైదరా బాద్, చెన్నైలలో రెక్కీని పూర్తి చేసింది. ఈనెల చివరి వారంలో రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభం కానుంది.



## బుదవారం పేట గ్రామంలో భూభారతి కార్యక్రమం.



మంథని( ప్రశ్న న్యూస్) రామగిరి మండలంలో చివరి రోజు కావడంతో రైతుల భూ సమస్యలపై వచ్చిన ప్రతి దరఖాస్తులను పరిశీలించిన మాజీ ఎంపీపీ అరెల్లి దేవక్క కొమురయ్య మాజీ సర్పంచ్ బుద్దర్తి బుచ్చయ్య, నాయకులు మాట్లాడుతూ మండలంలోని 17 గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నందుకు ధన్యవాదాలు తెలుపుతూ అలాగే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఐ. టి మంత్రి దుదుద్దిల్ల శ్రీధర్ బాబు చేపట్టిన రైతు బంధు పథకం కింద రైతులు లబ్ధి పొందిన వారికి కృతజ్ఞతలు తెలియజేస్తూ రైతన్నల అభివృద్ధియే రాష్ట్ర ప్రభుత్వ మొదటి ధ్యేయమని ఇన్ని ప్రజా సంక్షేమ పథకాలు కేవలం కాంగ్రెస్ ప్రభుత్వం తోనే సాధ్యం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని భూ సమస్యలు తీరే వేల తమ సంతోషల్ని వెల్లుబుచ్చారు.

## ధర్మరాజుల స్వామి వార్షిక తిరునాళ్లు గోడపత్రిక




శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానానికి అనుబంధ ఆలయమైన శ్రీ ద్రౌపదీ సమేత శ్రీధర్మరాజుల స్వామి వారి వార్షిక తిరునాళ్లు ఈనెల 27వ తేదీ నుంచి ప్రారంభమవుతాయి. శ్రీ ద్రౌపదీ సమేత శ్రీ ధర్మరాజుల స్వామి వార్షిక తిరునాళు గోడపత్రికలను శ్రీకాళహస్తి నియోజకవర్గం శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి శ్రీ మేధా గురుదక్షిణామూర్తి సన్నిధానం వద్ద ఆవిష్కరించారు.

## శ్రీకాళహస్తిలో అక్షరాభ్యాసం



శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం నందు సాంఘిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని శ్రీకాళహస్తి నియోజకవర్గం శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి దేవస్థానం ఈవో కృష్ణారెడ్డి దేవస్థానం వేద పండితులు పౌరోహితులు అధికారులు సాంఘిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి పిల్లలకు అక్షరాభ్యాసం చేయించి వాళ్ల తల్లిదండ్రులు తో పాటు వచ్చిన పిల్లలకి పలక పుస్తకం పెన్సిల్ ఇచ్చినారు శ్రీకాళహస్తి దేవస్థానంలో అక్షరాభ్యాసం కార్యక్రమాలు ముఖ్యంగా వసంత పంచమి వంటి శుభదినాల్లో సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహిస్తారు. శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో శ్రీ మేధా గురుదక్షిణామూర్తి సన్నిధానం వద్ద అక్షరాభ్యాసం చేస్తారు. వేద పండితులు వేద మంత్రాలతో పిల్లలకు తల్లిదండ్రులతో కలిసి అక్షరాభ్యాసం చేయించారు. సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలు జరిగేటప్పుడు ఆలయ అధికారులు పలకలు, పుస్తకాలు వంటి విద్యా సామగ్రిని పిల్లలకు ఉచితంగా అందిస్తారు.

## అంతర్జాతీయ యోగా దినోత్సవం విజయవంతం చెయ్యాలి మాజీ శాసన సభ్యులు ఎస్ సి వి నాయుడు.




శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్)అంతర్జాతీయ యోగా దినోత్సవం విజయవంతం చేయాలని శ్రీకాళహస్తి పట్టణ మాజీ శాసన సభ్యుడు ఎస్ సి వి నాయుడు స్వగృహంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ యోగ సాధనలో శ్రీకాళహస్తి మాజీ శాసన సభ్యులు ఎస్ సి వి నాయుడు. తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు. కార్యకర్తలు పాల్గొన్నారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూప్రపంచానికి భారతదేశం అందించిన గొప్ప వరం యోగా.యోగాతో మానసిక ఆందోళన, ఒత్తిడి, దిగులు వంటివి దూరమవు తాయి. శారీరక రుగ్మతలు తొలగిపోతాయి. ప్రతి ఒక్కరి శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగా ఎంతో అవసరం. ప్రజలు ఆరోగ్యంగా ఉంటే సమాజం, దేశం ఆరోగ్యంగా ఉన్నట్లే. ప్రస్తుతం 177 దేశాలు యోగాను ఆచరిస్తుండడం భారతీయులుగా మనందరికీ గర్వకారణం.సందర్భంగా శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే ఎస్సీవి నాయుడు మాట్లాడుతూ ఈ నెల 21 విశాఖపట్నంలో జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవం కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొంటున్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు, కూటమి నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలి. మీడియాకి వెల్లడించారు కార్యక్రమంలో పట్టణ ప్రజలు ప్రముఖులు అధికారులు నాయకులు పాల్గొన్నారు.

# ముని్సిపల్ డ్రైనేజ్ ఆక్రమణ..

**బాధితులు ఫిర్యాదు చేసిన పట్టించుకొని అధికారులు**

**డ్రైనేజ్ తో ఇబ్బంది పడుతున్న... ప్రజలు**

**మున్సిపల్ కమిషనర్ చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారా ..**





మంథని ( ప్రశ్న న్యూస్) మంథని మున్సిపల్ పరిధిలోని ఎరుకుల గూడెంలో డ్రైనేజ్ అక్రమనకు గురైనట్లు స్థానిక ప్రజల నుండి విమర్శ వస్తున్నాయి. గత కొద్ది రోజుల నుండి ప్రజలు ఈ డ్రైనేజ్ వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఓ మాజీ వైస్ చైర్మన్ ఆక్రమించుకొని ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని స్థానిక ప్రజలు ఆవేదన చెందుతున్నారు. అన్యాయం జరిగితే పరిష్కరించాల్సిన ప్రజాప్రతినిధీ ఇలా డ్రైనేజ్ నే ఆక్రమించిన తీరు పట్ల ప్రజలు నివ్వెర పోతున్నారు.ఈ సమస్య కొద్ది రోజుల నుండి పేరుకుపోయి ఉంది. స్థానిక కాలనీ వాసులు పిర్యాదు చేసిన అధికారులు పూర్తి స్థాయిలో స్పందించడం లేదు. ఇప్పటికైన మున్సిపల్ కమిషనర్ చర్య తీసుకోవాలని ప్రజలు,జిల్లా స్థాయి అధికారులు ఈ సమస్యను పరిష్కరిస్తారో.. లేక సదరు ప్రజాప్రతినితిధీ

## యోగా కార్యక్రమంలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి

శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) శ్రీకాళహస్తి ఆలయం,గాలి గోపురం నందు సుమారు 2 వేల మంది తో పెద్ద ఎత్తున యోగా కార్యక్రమం. ఉత్సాహంగా యోగా కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా అధికారులు, యువత, మహిళలు, విద్యార్థులు యోగ మన శరీరానికి మేలు చేయడంతో పాటు ఏకాగ్రత పెరగడం, మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం కలుగుతుంది ప్రతి ఒక్కరు వారి దైనందిత జీవితంలో యోగాను క్రమం తప్పకుండా కొనసాగించాలి జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ మానసిక ఒత్తిడిని జయించేలా ప్రతి ఒక్కరు యోగా చేయాలి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ప్రతి ఒక్కరు మానసిక ఒత్తిడి నుంచి బయట పడటానికి యోగా ను వారి జీవితంలో భాగంగా చేసుకోవాలి బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ యోగా మన శరీరానికి మేలు చేయడంతో పాటు ఏకాగ్రత పెరగడం, మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం పొందవచ్చునని ప్రతి ఒక్కరి జీవితంలో యోగా ను క్రమం తప్పకుండా కొనసాగించాలని అప్పుడే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ తెలిపారు. శ్రీకాళహస్తి నియోజకవర్గం లోని శ్రీకాళహస్తి ఆలయం, గాలిగోపురం దగ్గర ఏర్పాటు చేసిన అంతర్జాతీయ యోగాంధ్ర దినోత్సవం కార్యక్రమంలో భాగంగా యోగాంధ్ర 2025 కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ , శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి, బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, పర్యాటకశాఖ రీజనల్ డైరెక్టర్ రమణ ప్రసాద్ తో కలిసి పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యోగా వలన శరీరానికి మేలు చేయడంతో పాటు ఏకాగ్రత పెరగడం మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం పొందవచ్చని అప్పుడే ప్రతి ఒక్కరు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. యోగాంధ్ర కార్యక్రమాలు రాష్ట్ర వ్యర్థంగా, జిల్లా వ్యాప్తంగా చేసుకుంటున్నాము అని యోగాంధ్రలో భాగంగా యోగా ను ప్రతి ఒక్క ఇంటికి ప్రతి ఒక్క మనిషికి చేరవేసేలాగా ముఖ్యమంత్రి జిల్లా అధికారులకు ప్రజా ప్రతినిధులకు అందరికీ ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. 177 దేశాలు యోగాను ఆచరిస్తుండడం భారతీయులుగా మనందరికీ




గర్వకారణం ఈ నెల 21 విశాఖపట్నంలో జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవం కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొంటున్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు, కూటమి నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలి.

## మండల జర్నలిస్టుల హక్కుల, సంక్షేమం దిశగా కృషి చేస్తా

- బోయినిపల్లి మండల ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షులు : పట్నం ప్రసాద్
- ప్రెస్ క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం
- బోయినిపల్లి మండల ఐజేయు ప్రెస్ క్లబ్ అధ్యక్షునిగా పట్నం ప్రసాద్ ఏకగ్రీవం





బోయినిపల్లి,(ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి మండల ఐజేయు ప్రెస్ క్లబ్ ఎన్నికలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మండలంలోని జర్నలిస్టుల సమక్షంలో నూతన అధ్యక్షులుగా సీనియర్ జర్నలిస్టు పట్నం ప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదే విధంగా పూర్తి కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఏర్పాటు చేశారు.మండల ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులుగా గజ్జెల శ్రీనివాస్,గడ్డం తిరుపతి,కత్తెరపాక శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా నల్లగొండ వేణుగోపాల్, కార్యదర్శిగా అతికం రాజశేఖర్ గౌడ్, కోశాధికారిగా కాసరపు శ్రీధర్ గౌడ్ బాధ్యతలు స్వీకరించగా, సంయుక్త కార్యదర్శులుగా మైలారం మహేష్, కూస రవి, కార్యవర్గ సభ్యులుగా దుంపేటి శ్రీనివాస్, పెంతల సంపత్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నూతన ప్రెస్ క్లబ్ అధ్యక్షులు పట్నం ప్రసాద్ మాట్లాడుతూ “బోయినిపల్లి మండలంలో జర్నలిస్టుల ఐక్యతను పటిష్టపరచడం, వారి హక్కులు, సంక్షేమం కోసం కలిసికట్టుగా కృషి చేయడమే మా లక్ష్యం. ప్రెస్ క్లబ్‌ను ఒక చైతన్య వేదికగా మార్చేందుకు మా కమిటీ కట్టుబడి ఉంటుంది. విలేఖరితనం మానవతా విలువలతో సాగాలి”, అని పేర్కొన్నారు.అనంతరం ప్రసాద్‌ను కార్యవర్గ జర్నలిస్టులు ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు సావనపల్లి గణేష్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

## బోయినిపల్లి మండల ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులుగా గజ్జెల శ్రీనివాస్ ఏకగ్రీవం - హర్షణీయం

- మండల సెస్ డైరెక్టర్, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కమిటీ జిల్లా సభ్యులు : కొట్టెపల్లి సుధాకర్





బోయినిపల్లి,(ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండల ప్రెస్ క్లబ్ మండల ఉపాధ్యక్షులుగా గజ్జెల శ్రీనివాస్ బుధవారం ఏకగ్రీవంగా ఎన్నిక కావడం హర్షణీయమని మండల సెస్ డైరెక్టర్, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కమిటీ జిల్లా సభ్యులు కొట్టెపల్లి సుధాకర్ అభినందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ – “మీడియా సమాజానికి అద్దం. ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లే వేదిక. గజ్జెల శ్రీనివాస్ వంటి సీనియర్ జర్నలిస్ట్ ప్రెస్ క్లబ్ బాధ్యతలు చేపడుతున్నది ఎంతో సానుకూల పరిణామం. ఆయన అక్షరశుద్ధి, సమాజపట్ల ఉన్న చిత్తశుద్ధి బోయినిపల్లి మండల ప్రెస్ క్లబ్ స్థాయిని మరింతగా పెంచుతాయన్న నమ్మకం ఉంది” అని అన్నారు.ప్రెస్ క్లబ్‌లో యువ జర్నలిస్టులకు మార్గదర్శకుడిగా, విలువలతో కూడిన పాత్రికేయతను ప్రోత్సహించగల నాయకత్వం శ్రీనివాస్ కు ఉన్నదని సుధాకర్ పేర్కొన్నారు. ఎన్నికైన నూతన బృందాన్ని ఆయన అభినందిస్తూ, భవిష్యత్తులో పూర్తి మద్దతు అందించనున్నట్లు హామీ ఇచ్చారు.

## కాంగ్రెస్ లో ఎలాంటి గ్రూపు రాజకీయాలు లేవు

**కాంగ్రెస్ నేత సాకర బోయిన మల్లేష్ ముదిరాజ్**



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) కాంగ్రెస్ పార్టీలో ఎలాంటి గ్రూపు రాజకీయాలు లేవని గుండ్ల పోచంపల్లి మున్సిపల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సాకర బోయిన మల్లేష్ ముదిరాజ్ స్పష్టం చేశారు. మేడ్చల్ కాంగ్రెస్ లో వర్గ పోరు ఉంది అంటూ వస్తున్న ఆరోపణలలో ఎలాంటి నిజం లేదని సాకార బోయిన మల్లేష్ ముదిరాజ్ స్పష్టం చేశారు. కొందరు నాయకులు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ పార్టీ కార్యక్రమాలకు ప్రభుత్వ పథకాల పంపిణీకి కార్యకర్తలను దూరం చేస్తున్నారు అంటూ ఓ బి సి విభాగ అధ్యక్షులు గువ్వ రవి ముదిరాజ్ చేసిన ఆరోపణలను పూర్తిగా ఖండిస్తున్నామన్నారు. షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి కార్యక్రమం గురించి ప్రతి ఒక్కరికి సమాచారం ఇచ్చామని తెలిపారు. ఒక వర్గానికి చెందిన నాయకులకు మాత్రమే సమాచారం అందుతుందని గువ్వ రవి ముదిరాజ్ చేసిన వ్యాఖ్యలలో ఎలాంటి నిజం లేదని పేర్కొన్నారు. కార్యకర్తలను అందరిని కలుపుకొని ఒకరి తక్కువ ఒకరు ఎక్కువ అంటూ బేధం చూపకుండా పార్టీ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని సాకర్ బోయిన మల్లేష్ ముదిరాజ్ స్పష్టం చేశారు. పార్టీలో ఓబీసీ అధ్యక్షులుగా పెద్ద హోదాలో ఉండి, ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరైన విధానం కాదని పేర్కొన్నారు. పార్టీలో అంతర్గతంగా చర్చించుకోవాల్సిన అంశాలను మీడియా లో రావడం వల్ల పార్టీకి నష్టం జరిగే అవకాశం ఉందని, అంతేకాకుండా కార్యకర్తలు అయోమయానికి గురయ్యే అవకాశం ఉందన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని ఓబీసీ సెల్ అధ్యక్షులు గువ్వ రవి ముదిరాజ్ కు గుండ్ల పోచంపల్లి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సాకార బోయిన మల్లేష్ ముదిరాజ్ సూచించారు.

## మృతి చెందిన తోటి కండక్టర్ కుటుంబానికి ఆర్ధిక సహాయం



మేడ్చల్( ప్రశ్న న్యూస్) మేడ్చల్ డిపో కండక్టర్లు మానవత్వాన్ని చాటుకున్నారు. అంజమ్మ అనే తోటి కండక్టర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా మిగతా కండక్టర్లు చందాలు వేసుకొని రూ. 42 వేలను మృతురాలు అంజమ్మ కూతురు మానస వీణకు అందజేశారు. ఈ సందర్భంగా మానస వీణను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆర్థిక సహాయం చేసిన కండక్టర్లను పలువురు అభినందిస్తున్నారు.

## బిజెపి నేతలకు సన్మానం



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) మేడ్చల్ మున్సిపాలిటీ బిజెపి కార్యదర్శులుగా నియమితులైన బండి విష్ణు గౌడ్, బొక్క సురేందర్ రెడ్డి ల ను గిర్మాపూర్ బిజెపి నాయకులు శాలువాతో సన్మానించి శు భాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మున్సిపాలిటీ మాజీ అధ్యక్షులు కొండం ఆంజనేయులు ముదిరాజ్, మున్సిపాలిటీ కిసాన్ మోర్చా అధ్యక్షులు చీర్ల సత్యనారాయణ, బీజేవైఎం జిల్లా కార్యదర్శి రాఘవ రెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు బొక్క శ్రీనివాస్ రెడ్డి, వంగేటి హనుమంత్ రెడ్డి, చెల్కల అనిల్ రెడ్డి, ముక్కెర మురళీ, వంగేటి మల్లా రెడ్డి, చెల్కల శ్రీపాల్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# కాప్రా సర్కిల్ పరిధిలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తం

- డివిజన్ సమస్యలపై పట్టింపు లేని కార్పొరేటర్
- శానిటేషన్ పై పర్యవేక్షణ చేయని డిప్యూటీ కమిషనర్ జగన్
- చెత్త కుప్పలతో నిండిపోతున్న డివిజన్ లు కంపు కొడుతున్న ప్రాంతాలు
- కాప్రా సర్కిల్లో అవినీతి అక్రమాలకే ప్రాధాన్యత ప్రజల సమస్యలపై స్పందన కరువు







**కాప్రా (ప్రశ్న న్యూస్)** కాప్రా సర్కిల్ పరిధిలో పారిశుద్ధ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. మెడికల్ ఆఫీసర్ బాధ్యతారాహిత్యం దానికి తోడు సిబ్బంది నిర్లక్ష్యం తోడు కావడంతో కాప్రా సర్కిల్ పరిధిలోని పారిశుద్ధ్య వ్యవస్థ పూర్తిగా చేజారి పోయిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎక్కడ చూసినా చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయని వాటిని పరిశుభ్రపరచడంలో ఎస్ఎఫ్ఏలు పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పరిస్థితి మరింత దిగజారిపోయింది. ప్రభుత్వం పారిశుద్ధ్యం కోసం కోట్లు ఖర్చు పెడుతున్న అధికారులు సిబ్బంది దానిపై తూతూ మంత్రంగా దృష్టి సారించడంతో పరిస్థితి అధ్వానంగా మారింది. చెత్తకుప్పల వల్ల అనేక వ్యాధులు వస్తాయని తెలిసి కూడా అధికారులు, స్థానిక కార్పొరేటర్లు నిర్లక్ష్యం చేయడం విడ్డూరంగా మారింది.

### కరువైన డిప్యూటీ కమిషనర్ జగన్ పర్యవేక్షణ

కాప్రా సర్కిల్ పరిధిలో డిప్యూటీ కమిషనర్ జగన్ పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజల సమస్యలను తీర్చడం లేదని డ్యూటీకి వచ్చామా ఇంటికి వెళ్ళామా అన్నట్లుగా మారింది పరిస్థితి. అదే కాకుండా కాప్రా సర్కిల్ పరిధిలో వివిధ విభాగాలలో అవినీతి అక్రమాలు హద్దు దాటిపోయి ఏఈ ఒక లక్ష ఇరవై వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కారు ఇలా డిప్యూటీ కమిషనర్ నిర్లక్ష్యంతోనే కాప్రా సర్కిల్ అద్వాన్నంగా మారిందని అదేవిధంగా శానిటేషన్, టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్, టాక్స్ విభాగాలలో సిబ్బంది భారీగా అవినీతి అక్రమాలకు పాల్పడుతుంటే డిప్యూటీ కమిషనర్ దృష్టికి తీసుకువచ్చిన పట్టించుకోకపోవడం ఆయన బాధ్యతారాహిత్యానికి నిదర్శనంగా నిలిచిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. కనీసం శానిటేషన్ పై కూడా డిప్యూటీ కమిషనర్ పర్యవేక్షణ లేదని చెత్తకుప్పలు తొలగించాలని ప్రభుత్వం చెబుతుంటే చెత్తకుప్పలను మరిన్ని పెంచడం చేస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చర్లపల్లి డివిజన్ పరిధిలో నాగారం వెళ్లే దారిలో అత్యంత అధ్వానంగా చెత్త రోడ్డుకు ఇరువైపులా పడేసి ఉన్నాయని వాటి నుండి వచ్చే దుర్గంధంతో పాదాచారులకు



వాహనాదారులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. ఇక్కడ ఉన్న స్థానిక కార్పొరేటర్ పట్టించుకోరు అధికారులు అసలే పట్టించుకోరు మరి ప్రజల సమస్యలు ఎలా తీరుస్తారో వాళ్లకే తెలియాలి.

## జీ7 వేదికగా ఏఐ డీప్‌ఫేక్‌లపై
# ప్రధాని మోదీ ఆందోళన

- ఏఐ రూపొందించిన కంటెంట్‌కు వాటర్‌మార్క్ ఉండాలని సూచన



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) పరిజ్ఞానం వల్ల తలెత్తుతున్న సవాళ్లు, ముఖ్యంగా డీప్‌ఫేక్‌ల వ్యాప్తిపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కెనడాలోని ఆల్‌బెర్టాలో జరుగుతున్న జీ7 దేశాల శిఖరాగ్ర సదస్సులో ఆయన మాట్లాడుతూ, ఏఐ ద్వారా రూపొందించే కంటెంట్‌కు తప్పనిసరిగా వాటర్‌మార్కింగ్ ఉండాలని లేదా అది ఏఐ సృష్టించినదనే స్పష్టమైన ప్రకటన ఉండాలని అభిప్రాయపడ్డారు. సమాజంపై ఏఐ చూపిస్తున్న ప్రభావం గురించి ప్రస్తావిస్తూ, ఈ సాంకేతికతకు సంబంధించిన సమస్యలను తగ్గించడానికి ప్రపంచవ్యాప్తంగా సమగ్రమైన పాలనా వ్యవస్థ అవసరమని ప్రధాని మోదీ సూచించారు. ప్రస్తుత యుగం ఏఐదే అయినప్పటికీ, సాంకేతికతతో కూడిన వ్యవస్థలను సురక్షితంగా కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఆయన నొక్కిచెప్పారు. డీప్‌ఫేక్ కంటెంట్ వల్ల తలెత్తే ప్రమాదాలను తగ్గించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజలకు అందుబాటు ధరల్లో, నమ్మకమైన, స్థిరమైన సాంకేతిక వ్యవస్థలను అందించడమే భారత్ ప్రధాన లక్ష్యమని మోదీ స్పష్టం చేశారు. సాంకేతిక పరిజ్ఞానం ప్రజలకు ప్రయోజనం చేకూర్చినప్పుడే దానికి నిజమైన విలువ ఉంటుందని ప్రధాని వ్యాఖ్యానించారు. ఈ విషయంలో ఏ దేశాన్ని కూడా వెనుకబడనివ్వకూడదని ఆయన అన్నారు. భారత్ తన సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రజాస్వామ్యబద్ధం చేసిందని, తద్వారా ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేయడంతో పాటు, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ద్వారా సామాన్య ప్రజలను కూడా శక్తివంతం చేసిందని ఆయన వివరించారు. ఈ సందర్భంగా సమగ్రమైన, సామర్థ్యవంతమైన, బాధ్యతాయుతమైన ఏఐ వ్యవస్థ ఆవశ్యకతను ఆయన నొక్కి చెప్పారు.

# జూబ్లీహిల్స్ బై పోల్ బరిలో టీడీపీ.?

## - అభ్యర్థిగా నందమూరి వారసురాలు.?




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో ఉప ఎన్నిక తప్పేలా లేదు. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణం తో ఆ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యంగా కనిపిస్తోంది. ఈ మేరకు ఇప్పటికే పార్టీలు చర్చలు మొదలు పెట్టాయి. సిట్టింగ్ సీటును బీఆర్ఎస్ కాపాడుకోవటానికి సెంటిమెంట్ అస్త్రం బయటకు తీస్తోంది. కంటోన్మెంట్ తరహాలోనే ఈ సీటులో పాగా వేయాలని కాంగ్రెస్ కసరత్తు చేస్తోంది. అనూహ్యంగా ఈ బైపోల్ లో టీడీపీ పోటీ చేయటానికి సిద్దం అవుతున్నట్లు తెలుస్తోంది. మిత్రపక్షాలు జనసేనతో పాటుగా బీజేపీతో చర్చలు సాగుతున్నాయి. అభ్యర్థి పైనా ఒక అంచనాకు వచ్చినట్లు పార్టీ ముఖ్య నేతల సమాచారం.

### - మారుతున్న లెక్కలు

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక అక్టోబర్ నెలాఖరులో జరిగే అవకాశం ఉంది. దీనికి సంబంధించి సెప్టెంబర్ లో షెడ్యూల్ విడుదల అవుతుందని అంచనా. కంటోన్మెంట్ సీటు తరహాలోనే జూబ్లీహిల్స్ స్థానం దక్కించుకోవాలని కాంగ్రెస్ భావిస్తోంది. ఇప్పటికే ఈ స్థానంలో పరిస్థితుల అధ్యయనం, నిర్ణయాల కోసం పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర రావు, వివేక్ తో సీఎం రేవంత్ ఒక కమిటీ ఏర్పాటు చేసారు. 2009 లో ఏర్పాటు అయిన ఈ నియోజకవర్గం నుంచి మాగంటి గోపీనాథ్ మూడు సార్లు గెలిచారు. 2014 లో టీడీపీ నుంచి గెలవగా, ఆ తరువాత బీఆర్ఎస్ లోకి వెళ్లారు. 2018,2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి గెలుపొందారు.

### - పార్టీల కసరత్తు

ఖైరతాబాద్ నుంచి విడిపోయి 2009 లో జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఏర్పాటు అయింది. 2009 లో పీ విష్ణువర్ధన్ రెడ్డి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలిచారు. ఇక, ఇప్పుడు బైపోల్ లో కాంగ్రెస్ నుంచి అజారుద్దీన్, పీజేఆర్ కుమార్తె విజయా రెడ్డి, నవీన్ యాదవ్ పేర్లు పరిశీలనలో ఉన్నాయి. ఇక్కడ ముస్లిం మైనార్టీ ఓటింగ్ కీలకం. కాంగ్రెస్ - ఎంఐఎం మధ్య పోటీ పైన అంగీకారం కుదిరితే మొత్తం లెక్కే మారిపోవటం ఖాయంగా కనిపిస్తోంది. అయితే, మాగంటి గోపీనాథ్ కుటుంబం నుంచే తమ పార్టీ అభ్యర్థిగా పోటీలో నిలపాలని బీఆర్ఎస్ భావిస్తోంది. సాధ్యం కాకుంటే మాజీ ఎమ్మెల్యే విష్ణుకు సీటు కేటాయించే ఛాన్స్ ఉంది. ఈ సారి అనూహ్యంగా టీడీపీ సైతం ఈ నియోజకవర్గంలో పోటీకి సిద్దం అవుతున్నట్లు తెలుస్తోంది. నియోజకవర్గంలో సామాజిక సమీకరణాలు ప్రస్తుత పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని భావిస్తున్నారు.

### - బరిలో టీడీపీ.!

గోపీనాథ్ మరణం సమయంలో ఏపీ మంత్రి లోకేష్ మాగంటి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఏపీలో సక్సెస్ అయిన ఎన్డీఏను తెలంగాణలోనూ విస్తరించాలనే ప్రతిపాదన ఉంది. త్వర లో గ్రేటర్ ఎన్నికలు జరగనున్నాయి. దీనికి ముందు జరుగుతున్న ఈ ఎన్నికతోనే పొత్తు ప్రారంభించాలనే ఆలోచన జరుగుతోంది. దీంతో,జూబ్లీహిల్స్ బైపోల్ లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థిని బరిలో నిలపాలని భావిస్తున్నారు. అందులో భాగంగా టీడీపీ నుంచి నందమూరి సుహాసిని పేరు పరిశీలనలో ఉందని పార్టీలో ప్రచారం సాగుతోంది. టీడీపీలో సుహాసిని క్రియాశీలకంగా ఉన్నారు. నందమూరి వారసురాలిగా సీటు ఇస్తే కలిసి వస్తుందని అంచనా వేస్తున్నారు. బీజేపీ సైతం ఇక్కడ నుంచి దీపక్ రెడ్డిని పోటీలో దింపాలని భావి స్తోంది. ప్రస్తుతం చర్చల స్థాయిలో ఉన్న ఈ ప్రతిపాదనల పైన మూడు పార్టీల అధినాయకత్వం చర్చించి తుది నిర్ణయం తీసుకోనుంది. ఇదే జరిగితే హైదరాబాద్ కేంద్రంగా కొత్త రాజకీయం మొదలు కానుంది.

# నెలల క్రితమే కొత్త ఇంజిన్, రూ.4000 కోట్లకు పైగా బీమా

- ఎయిరిండియా విమాన ప్రమాద దర్యాప్తులో కీలక విషయాలు



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) అహ్మదాబాద్‌లో ఇటీవల జరిగిన ఎయిరిండియా విమాన ప్రమాద ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర విషాదాన్ని నింపింది. జూన్ 12న సంభవించిన ఈ దుర్ఘటనలో 274 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదంపై కొనసాగుతున్న దర్యాప్తులో పలు కీలక అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. సుమారు 12 సంవత్సరాలుగా వినియోగంలో ఉన్న ఈ బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమానం కుడివైపు ఇంజిన్‌ను కేవలం మూడు నెలల క్రితమే ఓవర్‌హాలింగ్ సమయంలో అమర్చినట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. ఈ విమానానికి చివరిసారిగా జూన్ 2023లో నిర్వహణ పనులు చేపట్టగా, తదుపరి షెడ్యూల్ ప్రకారం డిసెంబర్ 2025లో నిర్వహించాల్సి ఉంది. ఇదిలా ఉండగా, ప్రమాదానికి గురైన విమానానికి సంబంధించిన బీమా వివరాలు చర్చనీయాంశంగా మారాయి. ఈ ప్రమాదం కారణంగా దేశ చరిత్రలోనే అతిపెద్ద విమాన బీమా క్లెయిమ్ నమోదయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. ప్రమాదానికి గురైన ఈ బోయింగ్ డ్రీమ్‌లైనర్ విమానానికి సంబంధించి ఎయిర్ ఇండియా సంస్థ బీమా కవరేజీని ఇంజిన్ మార్పిడికి ముందే రూ.750 కోట్ల నుంచి రూ.850 కోట్లకు పెంచింది. కాగా, ఈ ప్రమాదానికి సంబంధించి ప్రభుత్వ రంగ నాన్-లైఫ్ ఇన్సూరెన్స్ దిగ్గజం జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (జీఐసీ) మొత్తం క్లెయిమ్‌లు సుమారు 475 మిలియన్ డాలర్లు (భారత కరెన్సీలో సుమారు రూ.4,091 కోట్లు)గా అంచనా వేసింది. ఇది మన దేశంలో ఇప్పటివరకు నమోదైన అత్యధిక విమాన బీమా క్లెయిమ్‌గా రికార్డు సృష్టించే అవకాశం ఉంది. ఈ భారీ మొత్తంలో విమానం నష్టానికి గాను 125 మిలియన్ డాలర్లు కాగా, ప్రయాణికుల కుటుంబాలకు చెల్లించాల్సిన పరిహారం, థర్డ్ పార్టీ నష్టాలు, ఇతర వ్యక్తులకు జరిగిన నష్టాలు, ట్రావెల్ పాలసీల కింద మరో 350 మిలియన్ డాలర్లు చెల్లించాల్సి ఉంటుందని జనరల్ ఇన్సూరెన్స్ సీఎండీ రామస్వామి నారాయణన్ వెల్లడించారు.ప్రమాదం కారణంగా ఎయిర్ ఇండియా చెల్లించాల్సిన పరిహారం, నష్టాల చెల్లింపులు వంటివి కూడా కలిసి విమానం అసలు ఖరీదు కంటే దాదాపు రెండున్నర రెట్లు అధికంగా ఉండటం గమనార్హం. ప్రస్తుతం ఈ ఘటనపై దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతోంది.

## రూ.80 వేలు లంచం తీసుకుంటూ
# ఏసీబీకి చిక్కిన విద్యుత్ శాఖ ఎస్ఈ

## - కురవి, మరిపెడ సబ్ డివిజన్ల ఒప్పందాల రెన్యువల్ కోసం ఈ అక్రమం

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్రంలో అవినీతి అధికారులపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) కొరడా ఝుళిపిస్తోంది. తాజాగా మహబూబాబాద్ జిల్లాలో ఒక విద్యుత్ శాఖ ఉన్నతాధికారి లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు.

ఈ ఘటన బుధవారం చోటుచేసుకుంది. మహబూబాబాద్ సర్కిల్ పరిధిలోని తెలంగాణ ఉత్తర ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎన్‌పీడీసీఎల్) ఆపరేషన్స్ విభాగంలో సూపరింటెండింగ్ ఇంజనీరుగా పనిచేస్తున్న జనగాం నరేష్, ఒక ఫిర్యాదుదారుని నుంచి లంచం డిమాండ్ చేశారు. కురవి మరియు మరిపెడ సబ్-డివిజన్లకు సంబంధించిన ప్రస్తుతం అమల్లో ఉన్న అంగీకార పత్రాల ఒప్పందాలను యథాతథంగా కొనసాగించేందుకు అధికారికంగా సహకరించేందుకు గాను ఆయన మొత్తం రూ.1,00,000 లంచం అడిగినట్లు ఆరోపణలు ఉన్నాయి.ఇందులో భాగంగా ఇప్పటికే రూ.20,000 ముడుపులు స్వీకరించిన నరేష్, మిగిలిన రూ.80,000 బుధవారం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. ఫిర్యాదుదారుడు ఇచ్చిన సమాచారం మేరకు రంగంలోకి దిగిన ఏసీబీ బృందం, నరేష్‌ను లంచం డబ్బులతో సహా అదుపులోకి తీసుకుంది. ఆయనపై అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఏసీబీ అధికారులు ప్రజలకు కీలక సూచనలు చేశారు.

ఏ ప్రభుత్వ ఉద్యోగి అయినా లంచం అడిగితే తక్షణమే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఇందుకోసం తెలంగాణ అవినీతి నిరోధక శాఖ వారి టోల్ ఫ్రీ నెంబర్ 1064కు డయల్ చేయాలని సూచించారు. అంతేకాకుండా, వాట్సాప్ (9440446106), ఫేస్‌బుక్, ఎక్స్, అధికారిక వెబ్‌సైట్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఫిర్యాదుదారుల వివరాలు అత్యంత గోప్యంగా ఉంచుతామని ఏసీబీ అధికారులు భరోసా ఇచ్చారు.



## సాగునీటి ప్రాజెక్టుల నిర్లక్ష్యంపై
# బీఆర్ఎస్ పోరు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) : తెలంగాణలో సాగు నీటి ప్రాజెక్టులపై కాంగ్రెస్ ప్రభుత్వం చూపిస్తున్న ఉద్దేశపూర్వక నిర్లక్ష్యంపై పోరుకు బీఆర్ఎస్ రెడీ అవుతోంది. రైతుల పక్షాన మరో పోరాటానికి సిద్ధమవ్వాలని గులాబీ పార్టీ నిర్ణయించింది. బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ ఆధ్వర్యంలో త్వరలో ఆ పార్టీ నేతలతో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించనున్నారు. కాళేశ్వరంపై నిర్లక్ష్యం, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలతో పాటు రాష్ట్ర సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో అలసత్వం, ప్రాజెక్టుల నిర్వహణ వైఫల్యంపై ప్రధానంగా చర్చ జరగనుంది.

రాష్ట్ర సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంపై సీఎం రేవంత్ రెడ్డి మౌనంగా ఉన్నారని బీఆర్ఎస్ నేతలు మండిపడుతున్నారు. బీఆర్ఎస్ హయాంలో 90 శాతం పూర్తయిన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని పక్కనబెట్టారు. 2 పిల్లర్లు కుంగాయన్న సాకుతో మొత్తం కాళేశ్వరం ప్రాజెక్టును ఎండబెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వ కుట్రలను కేసీఆర్ వివరిస్తారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలో లక్షల ఎకరాల్లో రైతులకు సాగునీరు అందకుండా పోతోంది. రాజకీయ దురుద్దేశంతోనే అన్నదాతలపైన కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం కక్ష కట్టినట్లు వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ అంటోంది. ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి కాకపోతే, తెలంగాణకు తీరని నష్టం కలుగుతుంది. అందుకే ఉద్యమ కార్యాచరణకు బీఆర్ఎస్ ప్లాన్ చేస్తోంది. ఏడాదిన్నరగా తెలంగాణ రైతులను నిండా ముంచుతున్న కాంగ్రెస్ ద్రోహాన్ని ఈ ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు సమగ్రంగా చర్చించనున్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588